

కారుచౌకగా కొట్టేసి..

అడ్డగోలు అనుమతులు

- రైతులను భయపెట్టి, దాడులు చేసి భూముల కొనుగోలు
- రెవెన్యూలోకి మార్చి 400 ఎకరాల అటవీ భూముల ఆక్రమణ
- సీఎంగా చంద్రబాబు, ఎన్డీఏ రాకుంటే రాష్ట్రం పరిస్థితి వేరుగా ఉండేది
- సరస్వతి భూముల పరిశీలనలో జగన్‌పై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ధ్వజం

మాచవరం, పిడుగురాళ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి పదవిని.. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆనాడు వైఎస్ఆర్, మొన్నటి జగన్ సరస్వతి పవర్ పేరుతో ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. రైతులకు చెందిన భూములను కారుచౌకగా కొట్టేశారు. అడ్డగోలుగా అనుమతులు పొందారు..' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం వేమవరం, చెన్నాయపాలెం మధ్యలో సరస్వతి పవర్ ఇండస్ట్రీ పేరుతో (మిగతా 4వ పేజీలో)

అధికారంతో రాసేసుకున్నారు

సహజవనరులు అందరి సొత్తు అయినా జగన్ ఇష్టానుసారంగా వాడుకున్నారు. సరస్వతి సిమెంట్స్ పేరుతో అనుమతులు ఇవ్వరేమోనని సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీ పేరుతో అనుమతులు పొందారు. సిమెంట్‌కు ఉపయోగించే క్లింకర్ తయారీకి మాత్రమే అనుమతి తీసుకున్నారు. పర్యావరణ, పొల్యూషన్ అనుమతుల కోసం జగన్ దరఖాస్తు కూడా చేయలేదు. అధికారం అండతో 196 కోట్ల లీటర్ల కృష్ణాజలాల కేటాయింపులు చేసుకున్నారు. సీఎంగా నాడు రాజశేఖర్‌రెడ్డి, ఆ తర్వాత జగన్ వాళ్లంతట వాళ్లే సరస్వతి పేరుతో భూముల నుంచి అనుమతుల వరకు రాసుకున్నారు. వైఎస్ హయాంలో 31 సంవత్సరాల లీజుకు తీసుకున్నారు. 2014-19 మధ్యలో జగన్ 50 ఏళ్లు పాటు ఉండేలా లీజును పొడిగించుకున్నారు. రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చేందుకే ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు.


సరస్వతి భూముల వద్ద మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్


ఓపెన్ టాప్ వాహనంపై నుంచి మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

భూములపై విచారణకు ఆదేశాలు

రైతుల ఇష్టంతో పనిలేకుండా దాడులు చేసి భూములు కొనుగోలు చేశారు. ప్రభుత్వ భూములు, చుక్కల భూములు, కుంటలు, కాల్వలు సైతం జగన్ కలిపేసుకున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన భూములు కాకుండా వందల ఎకరాలు భూములు ఆక్రమించారు. అటవీ భూములున్నా రెవెన్యూ అనుమతి లేకుండానే పేరు మార్చేసుకున్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కలెక్టర్ అరుణ్‌కుమార్‌ను పవన్‌కల్యాణ్ ఆదేశించారు. రైతులపై దాడులు చేస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. ఉపాధి పేరుతో రైతులకు ఆశ కల్పించి ఇప్పటి వరకు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకపోవడంపై కూడా సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు.


సరస్వతి భూముల వివరాలను పవన్‌కల్యాణ్‌కు వివరిస్తున్న కలెక్టర్ అరుణ్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే యరపతినేని

రేపు తాళ్లాయపాలేనికి..

సీఎం చంద్రబాబు

- 400 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభించనున్న సీఎం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

తుళ్ళూరు/గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం తాళ్లాయపాలేనికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 400/220 కేవీ సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించను న్నారు. ఈ క్రమంలో ఆయా ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ మంగళవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ సీఆర్డీఏ పరిధిలో కార్యాలయాల డిమాండు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు ఉండేలా తాళ్లాయపాలెంలో 400/220 కేవీ సబ్‌స్టేషన్‌ను జీఐఎస్ పద్ధతిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం అనంతరం ఇతర జిల్లాలకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. బుధవారం సాయంత్రంలోపు పనులన్నీ పూర్తి చేసి ట్రయిల్ రన్ కూడా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పోవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాష, ఆర్డీవో కే.శ్రీనివాసరావు, ఎంపీడీవో శిల్ప, తహసీల్దార్ సుజాత తదితరులు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబు ప్రారంభించనున్న తాళ్లాయపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి,ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి

సమన్వయంతో.. సత్ఫలితాలు

- జిల్లాను అభివృద్ధి దిశగా పయనింపచేస్తాం
- వేగంగా పంట కాల్వల ఆధునికీకరణ పనులు
- డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించాలంటే ముందుగా రాజకీయ నాయకత్వంతో పాటు అధికారులు కలిసి సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు వస్తాయి. ఇందుకోసం చిత్తశుద్ధితో పనిచేసి జిల్లాను పురోగమన బాట పట్టిద్దాం. 95 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండడం వరం. దానిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోగలిగితే పెద్దఎత్తున ఉపాధి అవకాశాల కల్పన జరుగుతుంది.' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బాపట్ల కలెక్టరేట్ వేదికగా మంగళవారం జరిగిన డీఆర్సీ సమావేశానికి అధ్యక్షత వహించిన ఇన్‌చార్జి మంత్రి జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. జలవనరులు సమృద్ధిగా అందుబాటులో ఉన్న బాపట్లలో ప్రభుత్వం తేబోతున్న ఇండస్ట్రీ పాలసీ అమలైతే పెద్దసంఖ్యలో ఉపాధి కల్పన జరుగుతుందన్నారు. సంక్షేమం అందించడంతో పాటు ఐదేళ్లలో ప్రజల తలసరి ఆదాయం పెంచడానికి కూడా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జాబ్‌కార్డులు ఇచ్చిన వారందరికీ ఉపాధి హామీ పథకం కింద వందరోజుల పనిదినాలు కల్పించాలని ఆదేశించారు. కాల్వల మరమ్మతు పనులకు తక్షణమే టెండర్లు పిలిచి మార్చి నెలాఖరుకు పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. డీఆర్డీఏ పరిధిలోని లీడర్లపై ఫిర్యాదులు వస్తున్నాయని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.


సమీక్షకు హాజరైన వివిధ విభాగాల అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థ సారథి, పక్కన జిల్లా నేతలు

మెడికల్ కళాశాల పనులు ఎందుకు ఆగాయి

బాపట్లలోని మెడికల్ కళాశాల పనుల పురోగతితో పాటు ఏ కారణం చేత పనులు ఆపారో తెలపాలని మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధికారులను అడిగి తెలుసుకున్న నివేదిక అందించాలని మంత్రి తెలిపారు. సాగు నీటి విషయంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగడానికి వీల్లేదన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్‌కు సంబంధించి గతంలో నిర్మించుకున్న గృహాలను అర్హులకు అందించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. డీఆర్సీ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలకు సంబంధించి తదుపరి డీఆర్సీ నాటికి ఫలితాలు కనబడాలన్నారు.

నీటి ప్రవాహంపై పర్యవేక్షణ ఉండాలి : మంత్రి గొట్టిపాటి

పంటకాల్వల్లో నీటి ప్రవాహంపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కాల్వల లాకుల వద్ద లస్కర్లను తక్షణమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భవనాసి రిజర్వాయర్‌కు నీరందించే ప్రక్రియ వేగంగా జరగాలని తెలిపారు. కొరిశపాడు ఎత్తిపోతల పథకం పనులు నిలిచిపోవడంపై నివేదిక ఇవ్వండన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

పింఛన్లలో అనర్హులను తొలగించాలి : మంత్రి అనగాని

ఎన్టీఆర్ భరోసా ఫించన్లలో అనర్హులు ఉంటే తొలగించాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అదే సమయంలో అర్హత కలిగిన ఏ ఒక్కరికీ పింఛన్ అందకపోవడం జరగరాదన్నారు. చివరి ఆయకట్టుకు నీరందేలా జలవనరుల శాఖ అధికారులు ఫీల్డ్ విజిట్ చేయాలన్నారు. చాలా చోట్ల అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపంగా మారుతుందన్నారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేయాలన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి : కలెక్టర్

స్వర్ణాంధ్ర-2047 విజన్ బాపట్ల లక్ష్యంతో యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. జిల్లాలోని 3.53 లక్షల మంది లబ్ధిదారులకు దీపం-2 పథకం ద్వారా మేలు జరుగుతుందన్నారు. ఇటీవల వరదలకు దెబ్బతిన్న గృహాలు, పొలాలకు రూ.69 కోట్లు పరిహారం చెల్లించామన్నారు.

లస్కర్ల నియామకం చేపట్టాలి : ఎమ్మెల్యే ఆనందబాబు


లస్కర్ల నియామకం చేపట్టి సమస్యలు పరిష్కరించాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు కోరారు. ఉచిత ఇసుక విధానం ఉన్నప్పటికీ ఇంకా క్షేత్రస్థాయిలో కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కోరారు. గుంటూరు ఛానల్ పనులు వేగంగా చేపట్టాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు తెలిపారు. ఉచిత ఇసుక విధానం సక్రమంగా అమలు చేయాలని చీరాల ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో ఇష్టం వచ్చినట్లు కొంతమంది ఇసుకను తవ్వుకుని వెళుతున్నారని దానిని కట్టడి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జేసీ ప్రఖర్ జైన్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రొవిజనల్

సరిపోదంట

- సీఈవో ఆదేశాలకు విరుద్ధంగా బీఎల్వోలు
- పట్టభద్రులుగా ఓటు హక్కు అర్హతపై వక్రభాష్యం
- పది, ఇంటర్ సర్టిఫికెట్లు తప్పనిసరి అంటున్న వైనం
- అధికారుల తీరుతో దరఖాస్తుకు వెనకడుగు వేస్తున్న ఓటర్లు

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఓటుహక్కు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలతో ఏర్పాటైన యూనివర్సిటీలు జారీ చేసిన డిగ్రీ సర్టిఫికెట్ ఏదైనా ఉంటే చాలని ఒకపక్క రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ స్పష్టం చేస్తున్నారు. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని కొందరు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని సమాచారం. ఓటుహక్కు దరఖాస్తుని ప్రాసెస్ చేయాలంటే తమకు తప్పనిసరిగా 10, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించడంతో పాటు వాటి కాపీలపై గజిటెడ్ అధికారి సంతకం చేసి ఉండాలని స్పష్టం చేస్తున్నారు. అలానే ఫారం-18 హార్డ్ కాపీ కూడా ఇవ్వాలంటున్నారు. ఇవన్నీ ఇస్తేనే దరఖాస్తుని ప్రాసెస్ చేసి ఏఈఆర్‌వో/ఈఆర్‌వోలకు పంపుతామని, లేకుంటే తీసుకునేది లేదని చెబుతున్నారు. దీంతో గతంలో మూడు సార్లు పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. ఎన్నికల సంఘం పట్టభద్రుల ఓటుహక్కు అర్హత విషయంలో స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. అయితే గుంటూరు నగరంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోలను ఈఆర్‌వోలు తప్పుదోవ పట్టించారు. 10, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే దరఖాస్తుని తిరస్కరించాలని ఆదేశించారు. ఆ మేరకు బీఎల్‌వోలు ఎలా పడితే అలా దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ ఓబులేసు దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా తమకు తెలియదని సమాధానం చెప్పారు. అలాంటి ఆదేశాలు ఏమైనా ఉంటే తమకు ఇస్తే పరిశీలిస్తామన్నారు. గుంటూరులో బీఎల్‌వోలు, ఈఆర్‌వోలు వ్యవహరిస్తున్న తీరుపై రాజకీయ పార్టీల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు, మూడు సార్ల నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు ఇప్పుడు అనర్హులని చెబుతుండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. దీనిపై తాము ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.



నేటితో గడువు ముగింపు

ఓటరు నమోదు కోసం సెప్టెంబరు 30వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకారాన్ని ఎన్నికల సంఘం ప్రారంభించింది. ఈ నెల 6వ తేదీ బుధవారం సాయంత్రం వరకు దరఖాస్తులను స్వీకరించను న్నట్లు ప్రకటించింది. ఓటర్ల సంఖ్య గతంలో కంటే పెరగకపోగా తగ్గే పరిస్థితులు కొంతమంది అధికారుల ప్రవర్తన కారణంగా తలెత్తాయి. ఓటరుగా నమోదయ్యేందుకు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దాంతో చాలామంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న అభ్యర్థులు శిబిరాలను ఏర్పాటు చేసి పట్టభద్రులతో దరఖాస్తు చేయిస్తున్నారు.

స్పందన అంతంతే..

కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నిక కోసం ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియకి ఆశించినంతగా స్పందన కనిపించడం లేదు. ఈ సారి ఓటర్ల సంఖ్య దాదాపుగా 3.50 లక్షల నుంచి నాలుగు లక్షల వరకు చేరుకోవచ్చని ఎన్నికల అధికారులు అంచనా వేశారు. 2019లో ఎన్నికలు జరిగినప్పుడు 2,48,799 మంది ఓటర్లుగా నమోదయ్యారు. అయితే ఈ దఫా ఇప్పటివరకు కేవలం 1.50 లక్షల దరఖాస్తులు మాత్రమే ఆరు జిల్లాల నుంచి అందాయి. ఈ నేపథ్యంలో లక్ష్యానికి చాలాదూరంలో ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాలు నిలిచాయి. మహా అయితే మరో 50 వేల దరఖాస్తులు కంటే ఎక్కువ వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

టోల్ బాదుడు

- ఒకేసారి 25.9 శాతం చార్జీల పెంపు
- కమర్షియల్ వాహనాలకు ఆర్థిక భారం
- ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయం ఆర్టీసీపై ప్రభావం



గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) టోల్‌గేట్ చార్జీలను భారీగా పెంచింది. వివిధ రకాల వాహనాలపై ఒకేసారి 25.9 శాతం పెరిగింది. అంతేకాకుండా తిరుగు ప్రయాణం విషయంలో నిబంధనని సవరించింది. గతంలో ఒకసారి రిటర్న్ జర్నీ తీసుకుంటే 24 గంటల వ్యవధిలో ఎన్నిసార్లు అయినా టోల్‌గేట్‌ని క్రాస్ చేయవచ్చు. అలాంటిది ఇప్పుడు ఒక్కసారికి మాత్రమే దానిని కుదించింది. పెరిగిన టోల్‌చార్జీలు ఏపీఎస్ఆర్‌టీసీ పైనా ప్రభావాన్ని చూపనున్నాయి. గుంటూరు - విజయవాడ మధ్య కాజా, చిలకలూరిపేట - ఒంగోలు మార్గంలోని బొల్లాపల్లి, పిడుగురాళ్ల - పొందుగల మధ్య బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న టోల్‌గేట్ల చార్జీలు భారీగా పెరిగాయి. కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన (మిగతా 4వ పేజీలో)


చిరుమామిళ్ళలో విచారిస్తున్న ఆర్డీవో మధులత

వైసీపీ నేత అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఆర్డీవో విచారణ

నాదెండ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిరుమామిళ్ళకి చెందిన వైసీపీ నేత, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డితో పాటు కుటుంబసభ్యులు చేసిన అక్రమ రిజిస్ట్రేషన్‌పై నరసరావుపేట ఆర్డీవో మధులత మంగళవారం విచారణ జరిపారు. గ్రామంలోని సర్వే నెంబరు 174 చెరువు పోరం బోకు భూమిని 173-ఏ సర్వే నంబరుగా దొంగ సర్టిఫికెట్ పుట్టించిన కోటిరెడ్డి తన చిన్న కోడలు యశోద పేరుతో 2002లో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆమె నుంచి సాయిబాబా ట్రస్ట్ చైర్మన్‌గా ఉన్న మేకల రామిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి సొమ్ము చేసుకున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఈ క్రమంలో గడిచిన ఆదివారం చెరువు స్థలంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌తో సహా ఆ ప్రాంతాన్ని సర్వే చేసిన అధికారులు చెరువు పోరంబోకుగా నిర్ధారించారు. దీనిలో భాగంగా ఆర్డీవో మాధవిలత ఆ గ్రామాన్ని సందర్శించి విచారణ జరిపారు. 2013 సంవత్సరంలో వీఆర్‌వోగా పని చేసిన చిన బ్రహ్మంను పిలిపించి విచారించారు. 2022 సంవత్సరంలో సర్టిఫికెట్ ఇచ్చారా? అని ఆమె ప్రశ్నించగా, ఆ సర్టిఫికెట్‌తో తనకు సంబంధం లేదని చిన బ్రహ్మం తెలిపారు. గతంలో చిన బ్రహ్మంకు సంబంధించిన రికార్డు పరిశీలించాలని, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించిన రామిరెడ్డి వద్ద ఉన్న ఆధారాలు తీసుకొని నివేదిక పంపాలని తహసీల్దార్ ఏవీ రమణకు సూచించారు. ఆర్డీవో వెంట గ్రామానికి చెందిన టీడీపీ నేత శ్రీనివాసరెడ్డి, జీ హరికృష్ణ, సర్వేయర్ రాంబాబు, వీఆర్‌వో, కార్యదర్శులు రాకూర్‌రెడ్డి, ప్రేమ్‌రాజ్, స్వాతి ఉన్నారు.

బెదిరించి నగదుతో ఉడాయించిన వ్యక్తి అరెస్టు


నిందితుడు శ్లారాను మీడియా ముందు ప్రవేశపెట్టిన చుండూరు సిఐ శ్రీనివాసరావు, అమృతలూరు ఎస్ఐ అమర్‌వర్ధన్‌లు

అమృతలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిని బెదిరించి కారులో నగదుతో ఉడాయించిన నిందితుడిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు బాపట్లకు చెందిన జానా సంశోన్ తన అత్త ఊరైన ప్రకాశం జిల్లా రాచర్ల మండలం అకు వీడు గ్రామానికి వెళ్లేందుకు గత నెల 14న తెల్లవారు జామున బాపట్ల బస్టాండ్ వద్ద వేచి ఉన్నాడు. గుంటూరు వెళు తున్నామని నలు గురు గుర్తుతెలియని వ్యక్తులు కారులో సంశోన్ ఎక్కించుకున్నారు. అతన్ని పొన్నూరు నుంచి దారి మళ్ళించి ఇంటూరు వైపునకు తీసుకువచ్చి అతన్ని కొట్టి బెదిరించి అతని వద్ద ఉన్న రూ.10 వేల నగదు, మోటో జీ60 మొబైల్‌ను తీసుకున్నారు. అనంతరం చందోలు బైపాసు రోడ్డు వద్ద దించి వెళ్లిపోయారు. సంశోన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అమర్‌వర్ధన్ కేసు దర్యాప్తు చేపట్టారు. చుండూరు సీఐ సీహెచ్‌ఎల్‌ఎన్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళ వారం ఉదయం పాంచాళ వరం రోడ్డులో సంచరిస్తున్న ముద్దాయి తురుమెళ్ల శ్లారాను తన సిబ్బం దితో ఎస్ఐ అరెస్టు చేయడంతో పాటు అతని వద్ద నుండి రూ.8 వేల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అతను వాడిన కారును స్వాధీనం చేసుకోవడంతో పాటు కోర్టుకు హాజరు పరచడం జరిగిందని తెలిపారు.

ప్రతి నీటి బిందువు కాంతి సింధువైంది

- టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టును పరిశీలించిన చీఫ్ ఇంజనీర్ కాంతారావు
- వరుసగా మూడో ఏడాది రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి


ఎంసీఆర్‌ను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ కాంతారావు, ఇతర ఇంజనీర్లు

రెంటచింతల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నీటి బిందువు కాంతి సింధువుగా మారిందని, రికార్డుస్థాయిలో విద్యుదుత్పత్తి చేయడం హర్షణీయమని శ్రీశైలం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ డీవీఎస్ఎస్ఎల్ కాంతారావు అన్నారు. సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మించిన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టును మంగళవారం ఆయన సందర్శించారు. కాంతారావు మాట్లాడుతూ ప్రతి ఏటా మార్చి 31 వరకు నిర్దేశించిన 78 ఎంయుల విద్యుత్ తయారవుతుందని, వరుణుడు సకాలంలో కరుణించడం, ఉద్యోగుల కృషి వలన నవంబరు 4వ తేదీ రాత్రికే ఈ లక్ష్యాన్ని అధిగమించామంటూ హర్షం వ్యక్తం చేశారు. మరో 5 నెలలో ఇంకా విద్యుత్ ఉత్పత్తి జరిగే అవకాశం ఉందని, ఆ దిశగా అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని బేరీజు వేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి కేవలం 0.7284 ఎంయుల విద్యుత్ మాత్రమే తయారైందని అందుకు అధికారులు బాధ్యులు కాదని ,ఎగువన ఉన్న సాగర్ నుంచి నీరు వస్తుంటేనే విద్యుత్ ఉత్పత్తి సాధ్యమౌతుందని స్పష్టం చేశారు. ఎంసీఆర్(మెయిన్ కంట్రోల్ యూనిట్) పలు విభాగాలను పరిశీలించిన ఆయన, ప్రాజెక్టు స్వరూప స్వభావాలను తెలుసుకున్నారు. రూ.1050 కోట్లతో నిర్మితమైన ఈ ప్రాజెక్టులో 2017 జనవరి 9న మొదటిసారి విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 551.47 ఎంయుల విద్యుత్ తయారైందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకుని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, ఏడీఈలు నాగరాజు,రత్తయ్య,మెహబూబ్,గిరిబాబు,జయశంకర్,సుబ్బారావు పాల్గొన్నారు.

కుడి జలవిద్యుత్ కేంద్రంలో పరిశీలన

మాచర్ల రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్ నాగార్జున సాగర్ కుడి జల విద్యుత్ కేంద్రాన్ని ఏపీ జెన్‌కో శ్రీశైలం కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కాంతారావు మంగళవారం పరిశీలించారు. జల విద్యుత్ కేంద్రంలో మరమ్మతులకు గురైన మూడో యూనిట్‌ను పరిశీలించి త్వరితగతిన యూనిట్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కుడికాలువ క్రస్ట్ గేట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం శ్రీసీతారాముల ఆలయాన్ని సందర్శించారు. సీఈ వెంట ఎస్ఈ రమణ, ఓఅండ్ఎం ఆర్‌సీపీహెచ్ డీఈ అప్పాజి, డీఈ రాజారెడ్డి, ఏడీఈ మోహన్‌బాబు, ఏఈఈ గౌతమ్‌కుమార్, అమర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులు, ఆర్థికసంస్థలు ముందుకొస్తున్నాయి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి


మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి బలమైన నాయకత్వం వచ్చిందని భావించిన పెట్టుబడిదారులు, ఆర్థికసంస్థలు ముందుకొస్తున్నాయని, రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి సంకల్పమని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బాపట్ల జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా టీడీపీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్ అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ రెడ్‌బుక్ పాలన అంటే చట్టాన్ని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడమేనని, దూరదృష్టి, పటిష్టమైన నాయకత్వం కూటమి ప్రభుత్వంలోనే ఉందని అన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడే వ్యక్తిగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముందుకెళుతున్నారని కొనియాడారు. త్వరలో పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కూటమి శ్రేణులంతా ఐక్యంగా ముందుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా గత వైసీపీ పాలనపై ఆయన విమర్శలు చేశారు. రాష్ట్రంలో వైసీపీ చీకటి పరిపాలన చేసిందని, జగన్ తన బంధువుల కోసం రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టారని, వారు చేసే దోపిడిని ప్రశ్నించరని ప్రజలకు డబ్బులిస్తే చాలని భావించారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు తెలివైనవారు కనుక ఎన్నికల్లో తగినబుద్ధి చెప్పారని అన్నారు. తల్లిని, చెల్లిని వెన్నుపోటు పొడిచిన వ్యక్తిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని ఘాటు విమర్శలు చేశారు.

ప్రజాహితమే రాష్ట్ర హితం : మంత్రి అనగాని

ప్రజాహితమే రాష్ట్రహితమని రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. అన్నిశాఖలలో నూతన విధానం తీసుకొచ్చి మంచి ఆలోచనలతో కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. కలిసి కట్టుగా రాక్షస పాలన తరిమికొట్టామని అద్భుత కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. 150 రోజులలో 160 మంచి కార్యక్రమాలు చేశామని, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం బ్రహ్మాండంగా పనిచేస్తుందని పెట్టుబడిదారులు ముందుకొస్తున్నారన్నారు. జిల్లా స్థాయి సమన్వయ మిటీ సమావేశం త్వరలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, రాష్ట్ర పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు తాతా జయప్రకాష్‌నారాయణ, మానం విజేత, బీజేపీ జిల్లా అధ్యక్షులు కొత్రా లక్ష్మీనారాయణ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు తానికొండ దయాబాబు, పల్లంసరోజనీ, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు పమిడి భాస్కరరావు, నియోజకవర్గ పరిశీలకులు సాంబిరెడ్డి, పట్టణ, మండలపార్టీఅధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, కర్లపాలెం మండలపార్టీ అధ్యక్షులు వై.భూపతిరావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నిర్ణయాలు తీసుకున్నాక చెబుతున్నారు!

కీలక విషయాలలో నిర్ణయాలు తీసుకున్నాకే తమకు చెబుతున్నారని కూటమిలోని జనసేన, బీజేపీ నేతలు ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకొచ్చారు. డీఆర్సీ సమావేశంలో పాల్గొనడానికి బాపట్లకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి మంగళవారం పార్టీ కార్యాలయంలో శ్రేణులతో సమావేశం నిర్వహించారు. దానికి ముందు కూటమి పార్టీల నేతలతో అంతర్గతంగా సమావేశయ్యారు. చాలా విషయాలలో తమకు ముందస్తు సమాచారం ఉండడం లేదని జనసేన, బీజేపీ నేతలు ఇన్‌చార్జి మంత్రికి తెలిపినట్లు సమాచారం. ఇదే సమయంలో జనసేనలోని ఉన్న రెండు గ్రూపుల తకరారు కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. వీటితో పాటు ఇంకొన్ని విషయాలు కూడా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి రాగా ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశనలు విదేశీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత వారితోపాటు జిల్లాలో ఉన్న మిగిలిన ఎమ్మెల్యేలు, కూటమిలోని మూడు పార్టీల జిల్లా అధ్యక్షులు అంతా కలిసి ఓ రోజున సమావేశం పెట్టుకుందామనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఆ సమావేశంలోనే కూటమి పార్టీల ఇబ్బందులతో పాటు సమన్వయం చేసుకోవడంలో ఉన్న లోటుపాట్లపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే దివ్యాంగులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం మంత్రుల చేతుల మీదుగా జరిగింది. దీనికి సంబంధించి ముందుస్తుగా స్థానికంగా ఉన్న పార్టీ నేతలకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో పాటు నిన్నమొన్నటి వరకు టీడీపీని దుమ్మెత్తిపోసిన వైసీపీ వారికి ఆ కార్యక్రమంలో భాగస్వామ్యం కల్పించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే అంశాన్ని టీడీపీ నేతలు ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సదరు అధికారిణిని వివరణ అడిగినట్లు సమాచారం

కారుచౌకగా కొట్టేసి.. అడ్డగోలు అనుమతులు

(3వ పేజీ తరువాయి)

జగన్ కుటుంబం కొనుగోలు చేసిన భూములను మంగళవారం పవన్‌కల్యాణ్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ దళితులను, రైతులను భయపెట్టి సొంత కంపెనీ కోసం జగన్ కారు చౌకగా భూములు కొనుగోలు చేశారన్నారు. మాచవరం, దాచేపల్లి మండలాల్లో సరస్వతి పవర్ ఇండస్ట్రీ పేరుతో భూములు కొనుగోలు సమయంలో రైతులకు ఇచ్చిన మాటను అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి, ఆ తర్వాత జగన్‌రెడ్డి మరిచారన్నారు. దళితులను, రైతులను బెదిరించి దాడులు చేసి పెట్రో బాంబులు వేసి వేట కొడవళ్లతో వెంటాడి భూములను హస్తగతం చేసుకున్నారన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కోడెల శివప్రసాదరావుపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేసి పర్నిచర్ కొట్టేశాడని అక్రమంగా కేసులు పెట్టి వేధించి చనిపోయేలా చేశారన్నారు. మరి వందల ఎకరాల భూములను కారుచౌకగా కొట్టేసి, అడ్డగోలు అనుమతులు తెచ్చుకున్న జగన్‌పై ఎన్ని కేసులు పెట్టాలని ప్రశ్నించారు. సీఎంగా చంద్రబాబు, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాకుంటే ఏపీ పరిస్థితి వేరుగా ఉండేదని తెలిపారు. సరస్వతి భూముల విషయంపై క్యాబినెట్‌లో చర్చిస్తామన్నారు. సరస్వతి భూములపై గతంలో జరిగిన అన్ని విషయాలను యరపతినేని ద్వారా తెలుసుకున్నానని, యరపతినేని రైతులకు అండగా ఉంటున్నారన్నారు.

రైతులపై దాడులు చేస్తే ఉపేక్షించొద్దు

సరస్వతి పవర్ ఇండస్ట్రీకి భూములిచ్చిన రైతులపై దాడులు చేస్తే ఉపేక్షించవద్దని పోలీసు అధికారులను పవన్‌కల్యాణ్ ఆదేశించారు. భూములిచ్చిన రైతుల్లో ఆత్మస్థైర్యం పెరిగేలా చూడాలని ఎస్పీ శ్రీనివాసరావును ఆదేశించారు. మాచవరం మండలం చెన్నాయపాలెంలో 272.96, పిన్నెల్లిలో 93.79, వేమవరంలో 710.63, తంగెడలో 107.365 ఎకరాలు ఉన్నాయని, వాటిలో పట్టా 1083.715, చుక్కలు 76.19, అసైన్డ్ భూములు 24.84 ఎకరాలన్నారు. అంతేకాకుండా 400 ఎకరాలు అటవీ భూములను రెవెన్యూ కిందకు మార్చేసి సరస్వతి పవర్ కోసం తీసుకున్నారన్నారు.

ఫ్యాక్టరీ నిర్మిస్తారా.. భూములిచ్చేస్తారా?

మూడేళ్లలో ఫ్యాక్టరీ నిర్మించి, యువతకు ఉద్యోగాలిస్తామని రైతులను మభ్య పెట్టి భూములు కొనుగోలు చేసి 15 ఏళ్లుగా ఆ ఊసే మరిచిన జగన్ ఇప్పటికైనా ఫ్యాక్టరీ నిర్మించడమా లేదంటే భూములు తిరిగి ఇచ్చేయడమో చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సరస్వతి పవర్ పేరుతో తక్కువ ధరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి వేల కోట్ల రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. ఫ్యాక్టరీ నిర్మించకుండా, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా రైతులను రోజు వారి కూలీలుగా మార్చారన్నారు. ఫ్యాక్టరీ నిర్మించకపోవడంతో కొంతమంది రైతులు భూములు సాగు చేసుకునేందుకు యత్నించగా అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిలు గూండాలతో వచ్చి దాడులు చేశారన్నారు. సాక్షి పత్రికను అడ్డం పెట్టుకుని ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు రాస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. 500 ఎకరాల భూమిని సరస్వతి భూముల్లో జగన్ కలిపేసుకున్నాడన్నారు. వందలాది మంది రైతులు కొన్నేళ్లుగా ఉపాధి లేక అల్లాడి పోతున్నా జగన్‌కు ఏమాత్రం పట్టడం లేదన్నారు. అంతకముందు సరస్వతి భూములను ఓపెన్ టాప్ వాహనంపై నుంచి పవన్‌కల్యాణ్ పరిశీలించారు. అనంతరం కొందరు రైతులతో పవన్‌కల్యాణ్, యరపతినేని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్‌గోనేరి, ఆర్డీవో మురళీకృష్ణలతో పాటు వివిధ శాఖల అధికారులు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

టోల్ బాదుడు

(3వ పేజీ తరువాయి)

చార్జీలతో కారు/జీపు/వ్యాన్ సింగిల్ జర్నీకి రూ.145, రిటర్న్ జర్నీకి రూ.220, నెలవారీ పాసు రూ.4790కి పెంచింది. అదే ఎల్‌సీవీ వాహనానికి సింగిల్ జర్నీకి రూ.245, బస్సు/ట్రక్‌కు రూ.515, మూడు యాక్సిల్ వాహనం వరకు రూ.565, 4 నుంచి 6 యాక్సెల్స్ ఉన్న వాహ నాలకు రూ.810, హెచ్‌సీఎం/ఈఎంఈకి రూ.810, 7, అంతకంటే ఎక్కువ యాక్సెల్ వాహనాలకు రూ.820కి పెంచింది. రిటర్న్ జర్నీ ఎల్‌సీవీకి రూ.370, బస్సు/ట్రక్‌కు రూ.770, త్రీ యాక్సెల్ వరకు వాహ నాలకు రూ.845, 4 నుంచి 6 యాక్సెల్ వరకు వాహనాలకు రూ.1215, హెచ్‌సీఎం/ఈఎంఈకి రూ.1215, ఏడు, అంతకంటే ఎక్కువ యాక్సెల్ ఉన్న వాహనాలకు రూ.1230కి పెంచేసింది. నెలవారీ చార్జీలను కూడా బాదేసింది. ఎల్‌సీవీకి రూ.8230, బస్సు/ట్రక్‌కు రూ.17085, త్రీ యాక్సెల్ వరకు రూ.18810, 4 నుంచి 6 యాక్సెల్ వాహనాలకు రూ.27035, హెచ్‌సీఎం/ఈఎంఈకి రూ.27035, ఏడు, అంతకంటే ఎక్కువ యాక్సెల్ వాహనాలకు రూ.27290కి పెంచింది.

బస్సు చార్జీలు పెంచక తప్పని పరిస్థితి

టోల్ ప్లాజా రేట్లు పెంచడంతో ఆర్‌టీసీ, ప్రైవేటు బస్సుల చార్జీలను తప్పక పెంచాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. గతంలో 24 గంటల్లో ఎన్ని రిటర్న్ జర్నీలైనా చేసే అవకాశం ఉన్నందున ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు ఆ చార్జీలను ప్రయాణికుల వద్దనే వసూలు చేసేవారు. ఇప్పుడు ట్రిప్పుల లెక్కన టోల్‌చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఉదాహరణకు తాడికొండ - మంగళగిరి మధ్య ప్రైవేటు ఆప రేటర్ గతంలో నెలవారీ పాస్ తీసుకుంటే రూ.6500 అయ్యేది. ఇప్పుడు అపరిమిత రిటర్న్ జర్నీలు ఎత్తేయడం వల్ల నెలకు దాదాపుగా రూ.45 వేలు చెల్లించాల్సిన పరిస్థితి ఉత్పన్న మైంది. ఇదే పరిస్థితి ఆర్టీసీపై కూడా పడు తుంది. దీంతో వారు టిక్కెట్ల ధరలు పెంచి టోల్ భారాన్ని ప్రయాణికుల నుంచి వసూలు చేసే అవకాశం ఉంది.

నెలవారీ పాస్ చార్జీల్లోనూ పెరుగుదల

గతంలో టోల్‌ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తూ సొంత వాహనాలు కలిగిన వారికి నెలవారీ పాస్‌లను జారీ చేసేవారు. రూ.150 కట్టించుకుని ఈ పాస్ ఇచ్చేవారు. నెలలో 50 సింగిల్ జర్నీలు చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు దానిని రూ.340కి పెంచింది. 50 సింగిల్ జర్నీలు దాటితే అదనంగా చెల్లించాల్సి వచ్చేది.

'విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన' పురస్కారానికి పెనుగొండ ఎంపిక

గుంటూరు(తూర్పు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అప్పా జోస్యుల విష్ణు భొట్ల కందాళం ఫౌండేషన్ వారు ప్రతిష్టాత్మకంగా అందజేసే విశిష్ట సాహితి మూర్తి జీవిత కాల సాధన పురస్కారానికి ప్రముఖ సాహితీవేత్త పెనుగొండ లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. 2025 జనవరి 3, 4, 5 తేదీలలో విజయవాడలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే సభలో ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేస్తారు. 1972లో 'సమిధ' అనే కవితా ప్రచురణతో తన సాహిత్య ప్రస్థానం చేపట్టిన లక్ష్మీనారాయణ, రేపటిలోకి కవితాసంపుటి, అనేక, విదిత, దీపిక వ్యాససంపుటాలు, కామ్రేడ్ పులుపుల వెంకటశివయ్య జీవితచరిత్ర, గుంటూరు సీమ సాహిత్యచరిత్ర రచయిత, గుంటూరు కథలు, విశాలాంధ్ర తెలుగుకథ, అరాజకీయం, కథా స్రవంతి సంపుటాలు రాశారు. ఈ సందర్భంగా పెనుగొండను పలువురు అభినందించారు.

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

- బీసీ సంక్షేమశాఖ డీడీ మయూరి

గుంటూరు(విద్య),నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు (ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్) ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కే మయూరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన బీసీ,ఎస్టీ,ఎస్సీ అభ్యరులకు ఈ నెల 14 నుంచి రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 200 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తామని, టెట్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే ఇందుకు అర్హులని, టీసీసీలో వచ్చిన మార్కుల ప్రాతిపదికన, ఎస్‌జీటీలకు బీఎడ్‌లో వచ్చిన మార్కుల ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్స్‌కు శిక్షణ ఇస్తామని వివరించారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు పదో తరగతి, టీసీసీ, బీఈడీ, టెట్ మార్కుల లిస్టు, కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 1 లక్ష లోపు ఉండాలని సూచించారు. ఇతర వివరాలకు గుంటూరులోని రాజాగారితోటలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌ను 0863-2358071 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి మంగళగిరిలో కూచ్ బెహార్ ట్రోఫీ

మంగళగిరిసిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహర్ ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, హిమాచల్‌ప్రదేశ్ జట్ల మధ్య మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం నుంచి ఈ నెల 9 వరకు మ్యాచ్ జరుగు తుందని ఏసీఏ కార్యదర్శి సానా సతీశ్‌బాబు వెల్లడించారు. మ్యాచ్‌లో తలపడేం దుకు ఇరు జట్లు సన్నద్ధమయ్యాయని చెప్పారు. మ్యాచ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతా వరణంలో నిర్వహించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 586.60 అడుగులు ఉంది. ఇది 303.43 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9443 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5018 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 25,291 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 41,352 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా, శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 41,352 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఏఎన్‌యూ వెబ్ సైట్‌లో హాల్ టికెట్లు

పెదకాకాని, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య పరీక్షల నిర్వహణలో అవకతవకలకు పాల్పడిన శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ కేంద్రంలో పరీక్షలు రాసే విద్యార్థులకు కర్నూలులోని ఎస్ఎల్ ఎస్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాన్ని మార్చిన దృష్ట్యా విద్యార్థులకు నూతన హాల్ టికెట్లు అందించనున్నారు. దూర విద్యా కేంద్రం వెబ్ సైట్ నుండి వారి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా యూనివర్సిటీ దూర విద్య పరీక్షలకు కో ఆర్డినేటర్ ఆచార్య డీ రామ చంద్రన్ మంగళవారం తెలిపారు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

50,088 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 50,088 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 48,647 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 25,206 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16500	334	8000	15000
నెంబరు. 5	8000	12000	నెంబరు. 5	12000	15500
273	10000	13000	273	10000	12000
341	85000	15000	341	9000	14000
4884	10000	14600	4884	12000	13200
సూపర్ 10	-	-	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	17500	తేజ	8500	17500
బ్యాడిగి	8000	13000	బ్యాడిగి	9000	14500
దేవనూరు డీలక్స్	9000	14500	దేవనూరు డీలక్స్	10000	14500
తెల్లకాయలు	5000	10500	తెల్లకాయలు	5000	10000

ఆంధ్ర కవితా సారధి దాశరధి

● సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నిజాం నిరంకుశ పాలనను ఎదురొడ్డి పోరాడిన విప్లవ కవి, ఆంధ్ర కవితా సారధి దాశరధి అని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ మంగళవారం అన్నారు. దాశరధి 37వ వర్ధంతి సభలో సాహితీభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రి రావు, ప్రజాకవి డాక్టర్ ఎస్.శ్రీనివాస్ సంయుక్తంగా మాట్లాడుతూ దాశరధి 600 సినిమాలకు దాదాపు 2 వేల పైచిలుకు పాటలు రచించారని అన్నారు. అనంతరం రచయితలు బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కామరాజు కాళీదాసు, ఎం.జాకబ్ తదితరులు దాశరధి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

11న శ్రీమద్భగవద్గీత కంఠత పోటీలు

రేపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గీతా జయంతిని పురస్కరించుకుని 11వతేది శ్రీమద్భగవద్గీత కంఠత పోటీలు నిర్వహిస్తున్నామని ఓరియంటల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సాయి తెలిపారు. ఈ పోటీలు 11వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ప్రారంభిస్తామని పట్టణంలోని ఓరియంటల్‌హైస్కూల్లో నిర్వహిస్తారని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.వెయ్యి ఇవ్వనున్నట్లు, ఒక పాఠశాల నుంచి పోటీల్లో ఎంత మందైనా పాల్గొనవచ్చన్నారు. వివరాలకు ఓరియంటల్ హైస్కూల్‌ను సంప్రదించాలని తెలిపారు.

విద్యుదాఘాతానికి పూరిల్లు దగ్ధం

వేమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వేమూరు దళితవాడలో మంగళవారం ఉదయం విద్యుదాఘాతానికి పూరిల్లు దగ్ధమైంది. చిలక ఏసుబాబుకు చెందిన ఇంటి విద్యుత్ కనెక్షన్ ద్వారా మంటలు చెలరేగాయి. దీంతో ఇంటి పైకప్పు కాలిపోతుండగా సమీపంలోని గ్రామస్థులు మంటలను అదుపు చేశారు. ఇంటిలోని సామాన్లు బయటకు తరలించారు. రూ.50 వేల దాకా నష్టం వాటిలినట్లు రెవెన్యూ శాఖ అధికారులు అంచనా వేసి నివేదికను తహసీల్దార్ సుశీలకు సమర్పించారు.

నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ

వేమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు నమోదు బుధవారం సాయంత్రంతో ముగుస్తుందని, ఇంకా ఓటు హక్కు పొందవలసిన వారు దరఖాస్తులు దాఖలు చేసుకోవాలని ఎన్నికల అధికారి సుశీల కోరారు. 7 నుంచి తమకు అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ఓటు హక్కును కల్పించడం జరుగుతుందన్నారు.

● కొల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ బుధవారంతో ముగియనుందని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. 2021 నవంబరు 31కి ముందు డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు కోసం అర్జీలు ఆన్‌లైన్‌లో లేదా తహసీల్దార్ కార్యాలయంలో 6న సాయంత్రంలోగా అందజేయాలని కోరారు.

● చుండూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని, బుధవారం సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ దేవరకొండ నాగరాజారావు తెలిపారు. మంగళవారం వరకు 814 దరఖాస్తులు అందాయని, అర్హులు ఇంకా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్టీసీ డిపో లాభాల దిశగా తీసుకెళ్లేందుకు చర్యలు

● ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ



బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఆర్టీసీ డిపో నష్టాలలో ఉందని, దీనిని లాభాల దిశగా తీసుకెళ్ళేందుకు చర్యలు చేపడుతున్నట్లు డిపో మేనేజర్ (డీఎం) బి.శ్రీమన్నారాయణ తెలిపారు.

ఫటా ఫట్

ప్రశ్న : డిపో పరిధిలో ఎన్ని బస్సులు ఉన్నాయి?

డీఎం : బాపట్ల ఆర్టీసి డిపో పరిధిలో 42 బస్సులు ఉన్నాయి. అందులో సూపర్ లక్సరీ 6, ఎక్స్‌ప్రెస్‌లు 5, నాన్ ఏసీ స్లీపర్లు 2, పల్లెవెలుగు బస్సులు 29 చొప్పున ఉన్నాయి.

ప్రశ్న : ఏయే ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నారు?

డీఎం : బాపట్ల నుంచి హైదరాబాద్‌కు 3 సర్వీస్‌లు. విజయవాడకు 2 సర్వీస్‌లు, గుంటూరుకు 3 సర్వీస్‌లు నడుపుతున్నాం. పల్లెవెలుగు బస్సులు అన్ని ప్రాంతాలకు వెళుతున్నాయి.

ప్రశ్న : కొత్తసర్వీస్‌ల ప్రతిపాదన ఏమైనా చేశారా?

డీఎం : విజయవాడకు కొత్త సర్వీస్‌లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశాం.

ప్రశ్న : కార్తీక మాసంలో ఏయే ప్రాంతాలకు సర్వీస్‌లు ఏర్పాటు చేస్తున్నారు?

డీఎం : పంచారామం సర్వీస్ ఏర్పాటు చేశాం. సూర్యలంక సముద్రతీరానికి కార్తీక పౌర్ణమి రోజు 5 బస్సులు ఏర్పాటు చేస్తున్నాం. భక్తులు గ్రూపుగా వస్తే ఏ క్షేత్రానికైనా సర్వీస్ పెడుతాం. శబరిమలై వెళ్ళేందుకు అద్దె ప్రాతిపదికన సూపర్ లగ్జరి ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న : డిపో ఆధునీకరణ పనులకు నిధులు కేటాయించారా?

డీఎం : బాపట్ల ఆర్టీసీ డిపోలో అంతర్గత రోడ్ల మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపడుతాం. 15 సంవత్సరాలు దాటిన ఆర్టీసీ బస్సు ఒకటి పక్కన పెట్టాం. ఇంజనీరింగ్ విభాగం వారికి ప్రతిపాదనలు పంపుతాం.

ఓటర్ల నమోదు ప్రక్రియ అభినందనీయం

పిట్టలవానిపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీలోని ఐలెండ్ సెంటర్ కూడలి ఏర్పాటు చేసిన ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, సలహా కేంద్రాన్ని టీడీపీ నాయకులు, పరిశీలకులు, బండ్లమూడి బాస్కరరావు బృందం, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానేట్ సోపాటితో కలిసి మంగళవారం పరిశీలించారు.

రూపురేఖలు మారిపోయిన బీటీ రోడ్డు

● వాహనాల రాకపోకలకు విఘాతం

● ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం



గుడిపూడి గ్రామంలో కర్లపాలెం వెళ్ళే రోడ్డు ధ్వంసమైన చిత్రం



ఏట్రవారిపాలెం గ్రామ సమీపంలో గుంతలతో గుడిపూడి వెళ్ళే రోడ్డు

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఐదేళ్ళ వైసీపీ పాలనలో రహదార్ల ఆధునీకరణ పూర్తి స్థాయిలో మరిచిపోయారు. కనీస మరమ్మతులకు కూడా నోచుకోని అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారి అధ్వానంగా తయారయ్యాయి. అయినప్పటికీ అధికారులు, పాలకులు దీనిపై దృష్టిసారించలేదు. బాపట్ల మండలం ఈతేరు గ్రామంలోని జీబీసీ రోడ్డు నుంచి గుడిపూడి మీదగా కర్లపాలెం మండలం ఏట్రవారిపాలెం మీదగా నేషనల్ హైవేరోడ్డుకు అనుసంధానంగా లింకురోడ్డు ఉంది. ఈ రోడ్డును 2012-2013 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే గాదె వెంకటరెడ్డి హయాంలో రెండు మండలాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మెటల్ రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. దీంతో కర్లపాలెం మండల పరిసరప్రాంత ప్రజలు పొన్నూరు, గుంటూరు పరిసర ప్రాంతాలకు వెళ్ళేందుకు ఈ రోడ్డుమీదగా వెళ్ళేవారు. ఎక్కువగా ఆసుపత్రులకు సకాలంలో వెళ్ళేందుకు రోడ్డు ఎంతో ఉపయోగంగా ఉండేది. ఆతర్వాత కాలక్రమేణ రోడ్డు ధ్వంసమౌతూ వచ్చింది. రోడ్డుకు ఇరువైపుల వ్యవసాయ భూములు ఉన్నందున దమ్ముచక్రాల ట్రాక్టర్లు పోనివ్వటం వల్ల కొంత దెబ్బతింది. దీంతో రెండు మండలాలకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డుపై ప్రయాణం తగ్గించారు. ప్రమాదాలు జరుగుతున్నాయని భయపడి పొన్నూరు, గుంటూరు వెళ్ళాలంటే ఇటు బాపట్ల వచ్చి లేదా అటు చందోలు మీదగా వెళుతున్నారు. దీనివల్ల 15 కిలో మీటర్లు దూరం తిరిగి వెళ్ళాల్సిన పరిస్థితి. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్డును ఆధునీకరించి రాకపోకలకు అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తి ప్రపత్తులతో నాగుల చవితి వేడుకలు



జంపని వీరాంజనేయస్వామి ఆలయంలో పుట్ట పూజలు చేస్తున్న భక్తులు

వేమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లో మంగళవారం నాగుల చవితి పండుగను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ప్రతి గ్రామంలో హిందూ భగవత్ భక్తులు ఉపవాస దీక్షతో నాగేంద్రుని పుట్టల వద్ద పూజలు చేసి పాలు పోసి మొక్కుబడులు తీర్చుకున్నారు. జంపని వీరాంజనేయస్వామి, రామేశ్వర, వేమూరు రామలింగేశ్వర, చావలి వాలేశ్వర ఆలయాలతో పాటు బలిజేపల్లి, చావలి, చదలవాడ, పెరవలిపాలెం, అబ్బనగూడవల్లి, బూతుమల్లి గ్రామాల్లోని నాగేంద్రుని ఆలయాల పుట్టల వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. జంపనిలో విశేషించి ముస్లింలు ఉపవాస దీక్షతో పుట్టలలో పాలు పోసి పూజలు జరిపారు. శివ, విష్ణు ఆలయాలు భక్తజన సందోహంతో కిటకిటలాడాయి.

● కొల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగుల చవితి పర్వదినాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. కొల్లూరుతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో మహిళలు ఆయా ప్రాంతాల్లో ఉన్న నాగేంద్రస్వామి పుట్టల వద్దకు ఉదయాన్నే వెళ్ళి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేసి కోడిగుడ్లు, పాలు సమర్పించారు.

● కర్లపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలుగ్రామాలలో, కర్లపాలెంలోని శివాలయాలలో శ్రీ పెద్దింటమ్మతల్లి దేవాలయంలో ఉన్న నాగేంద్రస్వామి పుట్ట వద్ద నాగుల చవితి పర్వదినం సందర్భంగా భక్తులందరు పుట్టలో చలివిడి, ఆవుపాలు పోసి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని చింతాయపాలెంలో ఉన్న శ్రీ సౌరకాయల అంకమ్మతల్లి, గణపవరం, కర్లపాలెం, పేరలి, కొత్తనందాయపాలెం శివాలయాలలో, శ్రీలలిత త్రిపుర సుందరి ఆలయం, నాగేంద్రస్వామి ఆలయాలలో భక్తులు పాలుపోసి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని నల్లమోతువారిపాలెంలో జాతీయ రహదారి వెంట ఉన్న నాగేంద్రస్వామి ఆలయంలో వందలాది మంది భక్తులు పాల్గొని నాగేంద్రస్వామివారికి పాలు పోసి విశేష పూజలు నిర్వహించారు.

● చుండూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగుల చవితి సందర్భంగా మండలంలోని చినపరిమి, చుండూరు, మోదుకూరు, యడ్లపల్లి, దుండిపాలెంలోని నాగుల పుట్టల వద్ద శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు, కార్తీక దీపాలు వెలిగించి పుట్టలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పుట్టల వద్ద ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు.

● రేపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగులచవితిని పురస్కరించుకుని నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో ఉన్న పుట్టల్లో మహిళలు చిన్నారులచే ప్రత్యేక పూజలు నిర్వహించి నాగేంద్రస్వామికి పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని రామకోటి శివాలయం, ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయం, పేటేరు రోడ్డులోని అంజనేయస్వామి దేవాలయం, పాతపట్నంలో ఉన్న కోటలో నాగేంద్రస్వామి పుట్టల్లో మహిళలు పాలు పోసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా శివాలయాల్లో శివుడ్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



రేపల్లె రామకోటిపేట శివాలయంలో నాగుల చవితి సందర్భంగా పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

ప్రొఫైలింగ్ యాప్‌లో సమగ్ర సమాచారం పొందు పర్చాలి : మెప్మా పీడీ



శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న మెప్మా పీడీ విజయలక్ష్మి

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో సమగ్ర సమాచారం పొందుపర్చాలని మెప్మా పీడీ టీవీ విజయలక్ష్మి తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో పొందుపర్చే విషయమై మంగళవారం బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో అద్దంకి, చీరాల, రేపల్లె, బాపట్ల మెప్మాసిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పీడీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతిగ్రూప్ పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. సభ్యులు పేదరికం నుంచి బయటపడేందుకు, ఆర్థిక ప్రణాళికను తయారు చేయటానికి ప్రొఫైలింగ్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించటానికి అర్బన్ మార్కెట్ ద్వారా అవకాశం కల్పించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం కె.ఇంగ్రెసెల్‌బాబు, చీరాల డీసీహెచ్ కొండయ్య, రేపల్లె సీఎంఎం అరుణకుమారి, సీవోలు విజయలక్ష్మి, సుబ్బారావు, అరుణ, సుగుణ పాల్గొన్నారు.

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ

బాపట్ల, నవంబరు 05 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం బాపట్లకు మొదటిసారిగా విచ్చేశారు. ఆయనను ఎస్పీ తుషార్ డూడి మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.



యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పర్యటనకు మంగళవారం వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌లకు యానాది హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది తిరువీధుల శంకరప్రసాద్ వినతిపత్రం అందజేశారు. యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. వైసీపీ పాలనలో యానాది కార్పొరేషన్‌తోపాటు 90 శాతం సబ్సిడీతో రుణాలు ఇస్తామని చెప్పి పట్టించుకోలేదన్నారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీల కరపత్రాలు ఆవిష్కరణ

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తిరుమల-తిరుపతి దేవస్థానాలు హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరుశాఖ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ ఆఫీసర్ ఈ.అమ్మడు తెలిపారు. పట్టణంలోని దర్శి పెదమస్తాన్ నగర్‌లో ఉన్న వేణుగోపాలస్వామి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అమ్మడు మాట్లాడుతూ డిసెంబరు 11న గీతా జయంతిని పురస్కరించుకొని పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిసెంబరు 1న 6,7 తరగతులకు ఒక విభాగం, 18 సంవత్సరాలు లోపు వారికి ఒక విభాగం, 18 సంవత్సరాల వయస్సు పైబడినవారికి మరొక విభాగంలో పోటీలు నిర్వహించబడునన్నారు. జిల్లా అధ్యక్షుడు ప్రతాప్, కార్యదర్శి శివన్నారాయణ, బంద్రెడ్డి రజనీ, మద్దుల వెంకటేశ్వర్లు, దర్శి కోటేశ్వరరావు, వర్ల ఆంజి, కర్నేటి ప్రసాద్, తోట నారాయణ, వడ్లమూడి నాగరాజు, బత్తుల తిరుపతమ్మ, జంజనం హేమశంకరరావు పాల్గొన్నారు.

బయోమైనింగ్ పనితీరును పరిశీలించిన కమిషనర్

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జమ్ములపాలెం రోడ్డులో డంపింగ్ యార్డు వద్ద జరుగుతున్న బయో మైనింగ్ తీరును కమిషనర్ జి.రఘునాథరెడ్డి మంగళవారం పరిశీలించారు. అదేవిధంగా 23వ వార్డు వివేకానందకాలనీలో మున్సిపల్ పార్క్‌ను సందర్శించి అక్కడ ఏర్పాటు చేస్తున్న చిన్నపిల్లల ఆట వస్తువులను పరిశీలించారు. అన్న క్యాంటీన్‌లు సందర్శించి ఆహార నాణ్యతను, సౌకర్యాలను అక్కడ ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కరుణ, డి.శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు : కొల్లా

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియా కార్యకర్తలను అంటే ప్రత్యక్షంగా రాజ్యాంగంపై దాడి చేయటమేనని, ప్రాథమిక హక్కులైన భావప్రకటన స్వేచ్ఛను హరించి అరెస్టు చేసే పోలీసు చర్యలు క్షమించరానివని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వాపోవటం పిశాచాలు శాంతి సందేశం ఇచ్చినట్లు ఉందని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. రాజ్యాంగంపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. అతని ఐదేళ్ళ పాలనలో ఎన్నో ఉల్లంఘనలు జరిగాయని విమర్శించారు.

ఆధార్ కార్డు నమోదుపై స్పెషల్ డ్రైవ్

కొల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలకు అర్హులై ఆధార్ కార్డు లేని వారికి ఆధార్ నమోదుపై రెవెన్యూ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సచివాలయం-3 పరిధిలో 23 మంది ఎస్టీ కులస్తులకు ఆధార్ కార్డులు లేకపోవడాన్ని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు మంగళవారం గుర్తించారు. వెంటనే వారందరిని సచివాలయానికి రప్పించి డేటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డుల నమోదు ప్రక్రియను పూర్తి చేయించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తించేందుకు ఆధార్ కార్డు గుర్తింపు అవసరమని తద్వారా ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతారని, ఆధార్ కార్డు లేని వారు తమను సంప్రదిస్తే సచివాలయ సిబ్బందితో ఆధార్ నమోదు ప్రక్రియను జరిపిస్తామని తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రామారావు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీపెద్దింటమ్మకి కోన రఘుపతి పూజలు



శ్రీపోలేరమ్మఅమ్మవారికి పూజలు చేస్తున్న కోన రఘుపతి, వైసీపీ నాయకులు

కర్లపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగొల్లపాలెం పంచాయతీ నక్కలవారిపాలెంలో నూతనంగా నిర్మాణం చేసిన శ్రీపోలేరమ్మ అమ్మవారిని మాజీ ఉప సభాపతి కోన రఘుపతి మంగళవారం సందర్శించారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులందరు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, ఉపాధ్యక్షుడు పందరబోయన సుబ్బారావు, సర్పంచ్ యల్లావుల నాని, యల్లావుల ఏడుకొండలు, దబ్బకూటి కొండలు, కాసాని వరప్రసాద్, రమేష్, శ్రీనివాసరావు, తాజుద్దీన్ పాల్గొన్నారు.

చింతాయపాలెంలో అండర్ -14, 17, 19 మల్లకంబ్ పోటీలు

కర్లపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మల్లకంబ్ ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ -14, 17, 19 ఎంపికను మంగళవారం నిర్వహించామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ మద్దెన గోపి పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలి

రేపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఆర్.విజయబాబు అన్నారు. రేపల్లె మండలంలోని కారుమూరు, మోర్లవారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏవోలు కె.అజయ్‌గోపి, వి.లక్ష్మణస్వామి, అభ్యుదయ రైతులు, రైతులు పాల్గొన్నారు.

మోదుకూరు, తొట్టెంపూడిలలో..

చుండూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వరిపైరు బిర్రు పొట్ట నుంచి గింజ గట్టిపడే దశలలో ఉంది. పైరుకి ఈ దశలో చివరిసారిగా వేసుకునే ఎరువులు తగిన మోతాదు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బండ్లమూడి ఆదాంబాబు అన్నారు. మోదుకూరు, తొట్టెంపూడిలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ దశలో పైరుకి యూరియా, పొటాష్ ఎరువులు అవసరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాల రైతులు ఏఈవో గోపి, వీఏఏలు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి కింద పడి వ్యక్తి మృతి

పిట్టలవానిపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పాతనందాయపాలెం గ్రామపంచాయతీలోని ఎస్టీ కాలనీకి చెందిన అక్కల కృష్ణారెడ్డి (55) చెరుకుపల్లి మండలం అక్కల వెంకటరెడ్డిపాలెం గ్రామానికి వెళ్ళి తిరిగి ద్విచక్రవాహనంపై వస్తుండగా చందోలు హైవే రహదారిపై ఎదురుగా వచ్చిన ఓ వ్యక్తిని తప్పించబోయి బైక్‌పై నుండి కిందకి పడి తలకు తీవ్రగాయాలై సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య రాధిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించినట్లు చందోలు ఎస్సై ఆర్.స్వామి తెలిపారు. కృష్ణారెడ్డి మృతదేహానికి మంగళవారం పోస్ట్‌మార్టం నిర్వహించినట్లు కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రమాదభరితంగా చెట్టు కొమ్మ

కర్లపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సత్యవతిపేట(హైదర్‌పేట) నుంచి పేరలి వెళ్ళే ప్రధాన రహదారిలో చెట్టుకొమ్మ గాలికి సగం విరిగి రోడ్డుకు అడ్డంగా వాలిపోయింది. ఈ కారణంగా ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తమై చెట్టు కొమ్మను తొలిగించాలని ప్రజానీకం, వాహనదారులు కోరుతున్నారు.



యాజలి నుంచి పుచ్చుకుర్తివారిపాలెం రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు పార్థసారధి, రవికుమార్

ఆర్ అండ్ బీ రహదార్ల నిర్మాణానికి మంత్రుల శంకుస్థాపన

కర్లపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి గ్రామం నుంచి పిట్టలవానిపాలెం మండలం పుచ్చుకుర్తివారిపాలెం వరకు నూతనంగా నిర్మాణం చేయనున్న రోడ్లు, భవనాల శాఖ రహదారి నిర్మాణానికి బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలోని రహదార్లు అన్ని గోతులు లేకుండా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం స్వీకారం చుట్టిందని మంత్రులు అన్నారు. మంత్రులు పార్థసారధి, రవికుమార్‌లు బిడారు దిబ్బ చేరుకునే సరికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎదురేగి పూలజల్లులతో ఘనస్వాగతం పలికారు. ఆర్డీవో గ్లోరి సోపాటి మంత్రులకు పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య, కలెక్టర్ జె.వెంకటమురళి, టీడీపీ నాయకులు నక్కల వెంకటస్వామి, ఏపూరి భూపతిరావు, వేగేశన రాకేష్ వర్మ, జనసేననాయకులు గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్రబాబు, తహసీల్దార్ సుందరమ్మ, ఆదుర్దారి శ్రీనివాసరావు, ఆర్అండ్‌బి డీఈ అరుణ, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, పిట్ల వసంతరెడ్డి, మాజీ ఎంపీటీసీ బాషా, పలు గ్రామాల సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి పార్థసారథి



పారిశుధ్య కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి పార్థసారథి

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డీఆర్సీ సమావేశంలో పాల్గొనేందుకు మంగళవారం బాపట్ల విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారధి నియోజకవర్గంలో జరిగిన గుంతలు రహిత కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ ఉన్న పారిశుధ్య కార్మికులతో కలిసి తేనీరు తాగుతూ వారి సమస్యలను, సాధకబాధలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్యం, పనిముట్ల వివరాలు, వేతనాలు చెల్లింపులు, వారి కుటుంబ పరిస్థితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని 2,200 మంది పారిశుధ్య కార్మికులకు పనిముట్లు, ప్రాథమిక వైద్యకిట్లు ఇవ్వటానికి రూ.46 లక్షల నిధులు అవసరమని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన మంత్రి పార్థసారధి కలెక్టర్‌తో మాట్లాడి తక్షణమే జిల్లా మినరల్ ఫండ్ నుంచి నిధులు విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పారిశుధ్య కార్మికులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారధిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య, ఆర్అండ్‌బి ఈఈ గీతారాణి, డీపీవో ప్రభాకర్, ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కును లబ్ధిదారులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మంగళవారం అందజేశారు. మండల పరిధిలోని పోతార్లంక గ్రామానికి చెందిన కామినేని కృష్ణమూర్తి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందాడు. చికిత్స కోసం ఖర్చు చేసిన బిల్లును చూపించి సహాయం కోరగా స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేశారు. సీఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి రూ.87,985 మంజూరు చేసి వచ్చిన చెక్కును గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారునికి ఎమ్మెల్యే అందజేశారు.

భక్తిభావంతో ముక్తిని పొందవచ్చు : శివప్రసాద్



పూజలు నిర్వహిస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ భక్తిభావంతో ముందుకు వెళితే ముక్తిని పొంది ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. చెరుకుపల్లి మండలం గూడవల్లి గ్రామంలో వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. నాగులచవితి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థుల కృషితో ముఖద్వారాన్ని ఏర్పాటు చేసుకోవటం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, టీడీపీ నాయకులు దివి రాంబాబు, కమ్మెల శివరామకృష్ణ, గోగినేని వసుధ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న వైసీపీ నాయకులు

● జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మహేష్

రేపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విచ్ఛిన్నం చేసేందుకు వైసీపీ నాయకులు విషం చిమ్ముతున్నారని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కూటమి ప్రభుత్వానికి ఎలాంటి నష్టం జరగదని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రాసంశెట్టిమహేష్ అన్నారు. ఆయన మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ భీమవరంలో చేసిన వ్యాఖ్యలకు కూటమి ప్రభుత్వం బీటలువారుతుందంటూ వైసీపీ మాజీ మంత్రులు అంబటి రాంబాబు, రోజా మాట్లాడటం చూస్తుంటే వారికి మతిభ్రమించినట్లుగా ఉందన్నారు. రేపల్లె నియోజకవర్గంలో గ్రామానికి ఒక బెల్టుషాపును ఏర్పాటు చేస్తున్నారని, ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దేవగిరి శంకర్,భూపతి కోటి, మల్లిశెట్టి సాయి, కస్తూరి శ్రీనివాసరావు, గురుబ్రహ్మం, ఈపూరి సురేష్, పవన్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం, పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం



ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్న బాలాజీని సత్కరించిన టీడీపీ శ్రేణులు


కొల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వంతో పాటు పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ పరిశీలించారు. కొల్లూరు బస్టాండ్ సెంటర్‌లో కొంత కాలంగా జరుగుతున్న కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించి కార్యకర్తలకు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమంపై ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్న కార్యకర్త పత్తిపాటి నాగబాలాజీ ద్విచక్ర వాహనంపై కొల్లూరు బస్టాండ్ సెంటర్‌కు చేరుకోవడంతో మురళీకృష్ణ, టీడీపీ శ్రేణులు ఆయనను దుశ్శాలువాతో సత్కరించి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొరికపూడి ప్రసాద్, కుర్రా సత్యనారాయణ, యడ్ల శ్రీనివాస్, కొమ్ము తులామాను, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ మస్తాన్ మృతి



మస్తాన్ (ఫైల్)

వేమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వేమూరు తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న షేక్ మస్తాన్ (54) మంగళవారం అనారోగ్యంతో ఆయన స్వగ్రామమైన కొలకలూరులో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మస్తాన్ ఆకస్మిక మృతికి తహసీల్దార్ సుశీల, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీజ, కార్యాలయం సిబ్బంది, పలువురు వీఆర్వోలు, వీఆర్ఏలు సంతాపం వెలిబుచ్చారు.



అల.. వైకుంఠపురములో.. అన్నీ సమస్యలే !

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వెంకటేశ్వరస్వామి కొలువుదీరి ఉన్న దేవస్థానమది. తిరుమల తిరుపతి తరువాత అంతగొప్పగా విరాజిల్లుతున్న దేవస్థానం తెనాలి వైకుంఠపురం శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయం. ఈ ఆలయానికి తెనాలి పరిసర ప్రాంతాల నుండే కాకుండా తెలుగురాష్ట్రాలు, ఇతర ప్రాంతాలనుండి వేలాది భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చిపోతుంటారు. తిరుమల తిరుపతిలో స్వామి వారికి జరిగే విధంగానే ఇక్కడ కూడా పూజాదికార్యక్రమాలు జరపడం ఈ దేవస్థానం ప్రత్యేకత. ఆలయంలో సౌకర్యాలు నామమాత్రంగా ఉండటంతో భక్తులకు అవస్థలు తప్పడంలేదు.



కేశఖండనశాల కూల్చివేసిన పాత భవనం

- యాగశాల కాస్త కేశఖండన శాలగా మార్పు
- గోశాల కాస్త పాంగలిషెడ్డుగా మార్పు
- శంకుస్థాపన తోనే నిలిచిన కేశ ఖండనశాల
- దుస్తులు మార్చు గదులు లేక భక్తులు ఇబ్బంది



గోశాలలో పొంగలి చేస్తున్న భక్తులు

తెనాలి రూరల్, నవంబరు 5: తెనాలి వైకుంఠపురం శ్రీ లక్ష్మిపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో స్వామివారికి యజ్ఞపూజలు జరిపేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక యజ్ఞశాల నేడు కేశఖండనశాలగా మారింది. కోట్లాదిమంది దేవతలను పూజించిన ఫలం ఒక్క గోపూజతోనే సాధ్యమని పురణాలు, పండితులు చెబుతుంటారు. దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోశాల కాస్త పొంగలిషెడ్డుగా మార్చి గోవులు చెట్లకిందకు చేరాయి.



తల నీలాలు సమర్పించిన అనంతరం ఆరుబయటే బట్టలు మార్చుకుంటున్న భక్తుడు



గోశాల పొంగలిషెడ్డుకావడంతో చెట్లకింద ఉన్న గోవులు

దీంతో భక్తులకు గోపూజ దూరమయింది. దేవస్థానంలో సౌకర్యాలు మెరుగుపరుస్తూ భక్తుల మన్ననలు పొందాల్సి ఉండగా ఉన్న సౌకర్యాలు మరుగునపడుతుండటంతో స్వామివారి సేవకు వచ్చే భక్తులు గోవిందగోవింద అంటూ లెంపలేసుకుంటున్నారు.

కేశఖండనశాలకు శంకుస్థాపనతోనే సరి

ఆలయంలో భక్తులు స్వామివారి మొక్కుబడులు తీర్చుకునేందుకు ఏర్పాటు చేసిన కేశఖండనశాల భవనాన్ని గత వైసీపీ ప్రభుత్వంలో నేటమట్టం చేసి నూతన భవనాన్ని నిర్మించేందుకు అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం పాత భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేయకుండా పిల్లర్లవరకు ఆపి పనులు నిలిపివేశారు.

గోశాల కాస్త పొంగలిషెడ్డు

హిందువులు అత్యంత పవిత్రంగా గోవులను పూజిస్తారు. శాస్త్ర ప్రకారం వైకుంఠపురం ఆలయంలో గోవులను సంరక్షించేలా గోశాలను నిర్మించారు. ఐతే పొంగలి చేసుకునేందుకు ప్రత్యేక షెడ్డులేకపోవడంతో గోవులను చెట్లకింద కట్టివేసి గోశాలను పొంగలి షెడ్డుగామార్చారు.

ఆలయ కలశప్రతిష్టతోనే నిలిచిన పనులు

శ్రీలక్ష్మిపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో నూతనంగా నిర్మించిన కలశప్రతిష్టతో తదనంతరం జరగవల్సిన పనులు నిలిచిపోయాయి. ఆలయ పర్యవేక్షకులు వాటిపై దృష్టిపెట్టి పనులు పూర్తిచేయాలని చూడాలని కోరుతున్నారు.

కేశ ఖండన టిక్కెట్టు రూ.40.. సిబ్బందికి మరో రూ.40

నాపేరు రామారావు మాది ఈమని గ్రామం. స్వామివారిని దర్శనంచేసుకుని తలనీలాలు సమర్పించేందుకు వైకుంఠపురం శ్రీ లక్ష్మిపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానానికి వచ్చా. అయితే కేశఖండనకు రూ.40 పెట్టి టిక్కెట్టు తీసుకున్నా. ఇక్కడకి వచ్చి చూస్తే స్నానం చేసేందుకు కూడా సౌకర్యాలు లేవు. పాత భవనం కూల్చివేసి యాగశాలలో కేశఖండనశాల పెట్టారు. అందులోకి వెళ్లితే అక్కడ సిబ్బంది తలనీలాలకు రూ.40 ఇవ్వాలన్నారు. రూ.30 ఇచ్చి వచ్చాను. కుటుంబసమేతంగా ఆలయానికి వస్తే మహిళలు ఇబ్బందులు పడక తప్పదు. దుస్తులు మార్చుకునేందుకు సరైన వసతులు లేవు.



యాగశాలలో కేశఖండనశాల

పవిత్రమైన యజ్ఞశాలలోనే కేశఖండనశాల

యజ్ఞయాగాదులు జరిగే పరమపవిత్రమైన యాగశాలను కేశఖండన శాలగా మార్చారు. అక్కడ తలనీలాలు సమర్పించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. తలనీలాలు సమర్పించే సమయంలో నీటితో తలతడుపుకునేందుకు అనంతరం స్నానాలు చేసేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించలేదు. స్త్రీ, పురుషులు బహిరంగంగా కుళాయిల కింద స్నానాలు చేసి ఆరుబయట దుస్తులు మార్చుకునే పరిస్థితి నెలకొంది. స్త్రీలకు మాత్రం చిన్నపాటి బాత్రూమ్‌లు ఉండగా వందలాదిగా వచ్చే మహిళలకు అది చాలకపోవడంతో పాటు బట్టలు మార్చుచేసుకునే ప్రాంతంలో పై కప్పుకూడా లేకపోవడంతో రక్షణలేకుండా పోయింది.




సమావేశంలో మాట్లాడుతున్న వజ్రాల వెంకట నాగిరెడ్డి

విత్తనాలు నమూనా తీసే విధానం మార్చాలి

- పరీక్షల్లో నకిలీ అని తేలితే కంపెనీలను ఏ1గా చేర్చాలి
- రాష్ట్ర సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

గుంటూరు సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ విత్తనాల నమూనా తీసే విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని రాష్ట్ర ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్‌చేసింది. మంగళవారం గుంటూరులో రాష్ట్ర విత్తనవిక్రేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వజ్రాల వెంకటనాగిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ హైబ్రిడ్ మిరప విత్తనాలు నమూనా తీసినప్పుడు 450 గ్రాముల బరువు కలిగిన మూడు సీల్ ప్యాకెట్లు ఓపెన్ చేస్తున్నారని అన్నారు. అందులో ఒక్కొక్క ప్యాకెట్ నుంచి 10గ్రాములు నమూనా కింద అధికారులు తీసుకుంటున్నారని, మిగిలిన ప్యాకెట్లు ఎవరూ కొనడంలేదన్నారు. దానివల్ల విత్తనాల వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఇటువంటివిధానం వెంటనే మార్చాలని పేర్కొన్నారు. విత్తనాల నమూనా సేకరించి ల్యాబ్‌కి పంపిన తర్వాత అవి నకిలీ అని తేలితే వ్యాపారులను ఏ1 గా చేర్చుతున్నారని అన్నారు. సీల్ ప్యాకెట్ నుంచి విత్తనాలు సేకరించి అవి నకిలీ అని తేలితే కంపెనీ యజమానులను వదిలిపెట్టి, వ్యాపారులను నిందితులుగా చేర్చటాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. విత్తనాలు నకిలీ అని తేలినప్పుడు కంపెనీ యజమానులను ఏ1గా చేర్చి, వ్యాపారులను సాక్షిగా ఉంచాలని అన్నారు. బీజీ-2 కాటన్ విత్తనాలు నమూనా తీస్తుంటే, హెచ్ టీ ఆనవాళ్లు ఉన్నట్లు కొన్ని ల్యాబ్‌ల్లో వస్తుండడం పట్ల కూడా వ్యాపారులు ఆందోళన చెందుతున్నారని నాగిరెడ్డి పేర్కొన్నారు. జీఓటీ, జెర్మినేషన్ ఇంత శాతం ఉందని వ్యవసాయ శాఖ నిర్ధారించిన తర్వాత వాటిని అమ్ముతున్న సమయంలో వస్తున్న సమస్యలకు విత్తనాల వ్యాపారులను బాధ్యులను చేయడం సబబు కాదని అన్నారు. చిన్న చిన్న కంపెనీలు వారికి సంబంధించిన విత్తనాలు అమ్మకాలు జరుపుతున్నాయని, ఆ తర్వాత ఏదైనా సమస్య వస్తే రైతులు వ్యాపారులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. దాన్ని నివారించేందుకు విత్తనాలు సరఫరా చేస్తున్న చిన్న కంపెనీలు రైతుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. త్వరలోనే వ్యవసాయ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాలు తీసుకువెళ్తామని నాగిరెడ్డి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస రెడ్డి, పరమేశ్వర రెడ్డి, కార్యదర్శి చలపతిరావు, గుంటూరు జిల్లా చైర్మన్ సాంబిరెడ్డి, పల్నాడు జిల్లా చైర్మన్ హనిమిరెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, 26 జిల్లాల నుంచి ముఖ్యమైన విత్తన డీలర్లు పాల్గొన్నారు.



రూపులమ్మ.. కనబడవమ్మ

చరిత్ర బావి తరాలకు అతి భద్రంగా అందించాల్సిన అద్భుత సంపద. కనుమరుగు కాకుండా కాపాడుకోవాల్సిన అపురూప సంస్కృతి, ఘనమైన చరిత్రకు నిర్లక్ష్యం వలన రూపులమ్మ ఆలయం పూర్తిగా శిథిలమైపోయింది. ఆలయ గోపురం తప్ప ముఖద్వారమంతా చెరువులో పూడికమట్టితో మునిగిపోయింది. కనీసం మట్టి తొలగించి, అప్పటి ఆలయ విగ్రహాలను పరిరక్షించాల్సిన పురావస్తుశాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంది. ఆ కాలపు మాన్యుమెంట్స్ ఏమున్నాయోనని పరిశోధించాల్సిన అధికారులు, ఈ ఆల యానికి తమ రికార్డుల్లో ఓ గుర్తింపునిచ్చి వదిలేశారు. రూపులమ్మగా, మహాలక్ష్మి దేవమ్మగా ఆ కాలంలో ఓ వెలుగు వెలిగిన ఈ ఆలయాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఇక్ష్వాకులు, బుద్ధులు, జైనులు, శాతవాహనులు, చాళుక్యులు, హైహయరాజులు పాలించిన ఈ ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా అభివృద్ధి పరచాల్సిందిపోయి శిథిలాలను మరింత శిథిలావస్థకు చేరుస్తున్నారని ఈ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు.

గోపురం పదిలం 'అమ్మ' శిథిలం

- బాదామి చాళుక్యల కాలం నాటి రూపులమ్మ ఆలయం
- దుర్గి మండలం తేరాలలో శిథిలావస్థకు
- పూడిక మట్టిలో ముఖద్వారం

'పల్నాడు' అంటే అనుగురాజు, ఆయన కుమారులు నలగామ రాజు, మలిదేవరాజులు.. వారి మధ్య జరిగిన యుద్ధం.. ఇది మాత్రమే చాలా మందికి తెలుసు. కానీ , పల్నాట బాదామి చాళుక్యుల ఉనికి ఎంత మందికి తెలుసన్నది ప్రశ్నార్థకమే. కాల గర్భాన గతించిన చరిత్రలెన్నో నాటి కాలపు నిర్మాణాలతో వెలుగు చూసినా ఆదరణకు మాత్రం నోచుకోవడం లేదు. మన పక్కనే ఉన్నప్పటికీ గుర్తించలేని స్థితిలో ఉన్నాయి.

మాచర్లటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశాన్ని క్రీస్తు శకం 6-12 శతాబ్దాల మధ్య చాళుక్యులు పరిపాలించారు. 2వ శతాబ్దాంలో ఇక్ష్వాకుల సామంతులుగా ఉండే వీరు పల్లవుల ధాటికి తాళలేక కర్ణాటక వచ్చి స్థిరపడ్డట్లు చరిత్ర చెబుతోంది. అటు నుంచి రాయలసీమలోని కడప, కర్నూలుకు కూడా వీరి రాజ్యం విస్తరించింది. కర్ణాటకలో తమ స్వాధీనంలో లేని బాదామి ప్రాంతంలో కదంబులను ఓడించిన చాళుక్యులు బాదామి చాళుక్యులుగా ప్రసిద్ధి చెందారు. ఆ బాదామి చాళుక్యుల ఆలయ కట్టడాలను పోలిన రూపులమ్మ ఆలయం మాచర్లలో శిథిలావస్థలో ఉంది.



మట్టిలో పూడుకు పోయిన ముఖద్వారం

మహాదేవమ్మ చెరువులో కొలువై..

అందరూ చూస్తూ ఎవరూ పట్టించుకోని ఈ శిథిలాలయం మాచర్లకు ఐదారు కిలో మీటర్ల దూరంలో ని దుర్గి మండలం తేరాల సమీపంలో మహాదేవమ్మ చెరువు ఉంది. ప్రస్తుతం దీన్ని బ్రహ్మానాయుడు చెరువుగా పిలుస్తారు. తేరాలలోని సిద్ధేశ్వరస్వామి ఆలయాన్ని గతంలో ఏపీ హెరిటేజ్ అండ్ కల్చరల్ టూరిజంలో పరిశోధనలు చేస్తున్న రుచీసింగ్ సందర్శించారు. పక్కనే ఉన్న పాడుబడ్డ రూపులమ్మ ఆలయాన్ని ఆమె ఆసక్తిగా పరిశీలించి ఎన్నో శతాబ్దాల క్రితం నాటిదిగా గుర్తించారు. ఈ మేరకు భారత పురావస్తు శాఖకు ఈ సమాచారం అందించారు. ఆలయం రూపురేఖలు, దానిపై చెక్కిన నగిషీలు, శిల్పాలు, గోపురం తీరు వంటివన్నీ పరిశీలించి 7వ శతాబ్దంలో బాదామి చాళుక్యులు నిర్మించిన అతిపురాతన కట్టడంగా తమ రికార్డులకు ఎక్కించారు.



ఆలయం గోడలపై కళాకృతులు

ఏసీబీ వలలో వీఆర్వో

- రూ. 2 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన భర్త పేరుతో ఉన్న పొలాన్ని ఆన్‌లైన్‌లో భార్య పేరుమీద మార్చడానికి(మ్యుటేషన్ కోసం) రూ.2లక్షలు లంచం తీసుకుంటూ గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెం వీఆర్వో షేక్ హసీనా అవినీతి నిరోధకశాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ అదనపు ఎస్పీ మత్తె మహేంద్ర కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు రూరల్ మండలం వెంగళయపాలెం గ్రామానికి చెందిన ఎక్స్‌ఆర్మీ చెరుకూరి సత్యనారాయణ గత ఏడాది డిసెంబర్‌లో మృతి చెందారు. ఆయన పేరుతో గ్రామంలో ఎకరం 25 సెంట్లు వ్యవసాయ భూమి ఉంది. దానిని తన పేరు మీదకు మార్చుకునేందుకు (మ్యుటేషన్) కోసం సత్యనారాయణ భార్య ప్రమీల సచివాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు గత నెల 28న వెళ్ళారు. అంకిరెడ్డిపాలెం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న హసీనా వెంగళాయపాలెం గ్రామానికి గత అక్టోబరు 4 నుంచి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రమీల దరఖాస్తు చేసుకున్న రోజునే హసీనా రూ. 2.5 లక్షలు డిమాండ్ చేసింది. అయితే తాను అంత ఇచ్చుకోలేనని ప్రమీల చెప్పడంతో చివరకు రెండు లక్షల 20 వేల రూపాయలకు బేరం కుదుర్చుకుంది. దీనిలో భాగంగా అదే రోజున ప్రమీల నుంచి పదివేలు తీసుకుంది. ఈ నెల 2న ప్రమీల సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా రెండు లక్షలు ఇస్తేనే పని పూర్తి చేస్తానని హసీనా స్పష్టం చేసింది. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితురాలు ప్రమీల ఏసీబీ అధికారులను సంప్రదించింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వెంగళాయపాలెంలోని సచివాలయంలో ప్రమీల నుంచి వీఆర్వో రూ. రెండు లక్షలు నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని నగదు స్వాధీనం చేసుకున్నారు. కాగా హసీనా గతంలో మంగళగిరి ప్రాంతంలో పనిచేసిన సమయంలో కూడా ఆమెపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. అక్కడ రూ. ఐదు కోట్ల భూ వివాదంలో కూడా ఆమె పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఆమె గతంలో పని చేసిన ప్రతి చోటా ఇదే తరహాలో ముక్కు పిండి లంచం వసూలు చేసేదని ఆరోపణలు ఉన్నాయి.



లంచం తీసుకుంటూ పట్టుబడిన వీఆర్వో హసీనా

నర్సింగ్ విద్యార్థిని మృతి కేసులో

వీడిన మిస్టరీ

- లైంగిక సంబంధానికి ఒప్పుకోక పోవడంతో భవనంపై నుంచి తోసేసి చంపిన మహిళ

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్‌పై నుంచి కిందపడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పంపాల సువర్ణ (23)అనే నర్సింగ్ విద్యార్థిని కేసులో మిస్టరీ వీడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతురాజు వెంకట్ అనే వ్యక్తి నెహ్రూనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో వృద్ధుల ఆశ్రయం, సధార్ హోం నడుపుతున్నాడు. రెండు నెలల కిందట పంపాలా సువర్ణ(22) అనే నర్సింగ్ చదివే విదార్థిని సధార్ హోమ్‌లో చేరింది. సువర్ణను అదే హాస్టల్‌లో వుంటున్న విజయలక్ష్మి (48) అనే మహిళ లైంగిక సంబంధం కోసం ఒత్తిడి చేసింది. అందుకు సువర్ణ ఒప్పుకోక పోవడంతో ఆమెతో గొడవపడింది. సువర్ణ బాత్‌రూమ్‌కు వెళ్ళిన సమయంలో విజయలక్ష్మి కూడా వెళ్ళింది. అక్కడ కూడా విజయలక్ష్మి ఒత్తిడి చేయగా ఆమె తిరస్కరించింది. దీంతో అక్కడ జరిగిన తోపులాటలో సువర్ణను విజయలక్ష్మి కిందకు నెట్టేసింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నప్పటి నుంచి హాస్టల్స్‌లో ఉంటూ చదువుకుంటోంది.



నిరక్షరాస్యులకు అక్షరజ్ఞానం

ఉల్లాస్

పొదుపు సంఘాల మహిళలు ఆర్థిక సాధికారిత సాధించేలా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ, ప్రతీ సంఘంలోనూ దాదాపు ఇద్దరు లేదా ముగ్గురికి పైగా సభ్యులు నిరక్షరాస్యులుగా ఉంటున్నారు. ప్రస్తుతం వారందరినీ గుర్తించే పనిలో డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది ఉన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, వయోజన విద్యా విభాగం కలిసి 'ఉల్లాస్' కార్యక్రమం అమలు చేసేలా కార్యాచరణ రూపొందించింది.

- డిజిటల్ లావాదేవీలపై పొదుపు సంఘాల మహిళలకు అవగాహన
- సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం
- కాలానుగుణంగా మారేలా శిక్షణ
- సాయంత్రపు బడులు



సత్తెనపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :చదువులేని మహిళల్లో అక్షరాస్యతపై చైతన్యం పెంపొందేలా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందు కోసం లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా చదువు చెప్పటానికి ముందుకు వచ్చే మహిళలు, యువతులను వాలంటీర్లుగా ఏర్పాటు చేసి వారి ద్వారా నిరక్షరాస్యులను సాధారణ డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. జాతీయ విద్యా విధానం-2020 పాలసీకి అనుగుణంగా దీనిని అమలుచేస్తున్నారు. ఇందులో భాగంగా ఐదు విభాగాల్లో తర్ఫీదు ఉంటుంది.

ప్రతి గ్రామం నుంచి 10 నుంచి 20 మంది మహిళలకు చదువు నేర్పిస్తారు. అక్షరాలు నేర్చుకోవడం, సంతకాలు చేయటంతో పాటు బ్యాంక్ లావాదేవీల నిర్వాహణ తదితర వాటి పై అవగాహన కల్పిస్తారు. ప్రధానంగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయటం, మొబైల్ బ్యాంకింగ్ తదితర డిజిటల్ అక్షరాస్యతపై తర్ఫీదు ఇస్తారు. తద్వారా వీరు మరొకరిపై ఆధారపడకుండా తమ సొంతంగా బ్యాంకుకు వెళ్ళి గాని, ఇంటి నుంచి గాని తమ ఖాతాకు, సంఘానికి సంబంధించిన పనులు చక్కబెట్టేలా శిక్షణ పొందనున్నారు. 'ఉల్లాస్' అమలు బాధ్యతను ప్రభుత్వం టీసీఎస్ సంస్థకు అప్పగించింది. శిక్షణ పొందే మహిళలకు సులువుగా అర్థమయ్యే రీతిలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సంస్థ అభివృద్ధి చేసింది. ఇందులో సమాచారం, బోధన, అభ్యాసన వీడియోలు తెలుగులోనే ఉంటాయి. శిక్షణ పొందిన వాలంటీర్ల ద్వారా మహిళలకు బోధించనున్నారు. గ్రామాల్లో ఉండే అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక భవనాలను అక్షరాస్యకేంద్రాలుగా నిర్వహించనున్నారు. గతంలో అమలు చేసిన 'సాక్షర భారత్' తరహాలోనే సాయంత్రం బడులు ఉంటాయి. ప్రతి పది మందికి ఒక వాలంటీరు బోధిస్తారు. ఆరు నెలల పాటు జరిగే శిక్షణ ద్వారా ప్రగతి సాధించిన వారికి ధృవపత్రాలు ఇస్తారు. అదే విధంగా సార్వత్రిక విద్యా పాటం ద్వారా ఉన్నత తరగతులు చదివే వీలు కల్పిస్తారు. పల్నాడు జిల్లాలో 36,623 పొదుపు సంఘాలు ఉండగా, అందులో 3,71,023 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో నిరక్ష్యరాస్యులు 10,700 మంది ఉన్నారు.

నిరక్షరాస్యులు, వలంటీర్లు గుర్తింపు

\- పీడీ బాలూ నాయక్, డీఆర్‌డీఏ పల్నాడు జిల్లా



నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దటానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థతో పాటు వయోజన విద్యా విభాగం సమన్వయంతో పని చేస్తున్నాయి. పల్నాడు జిల్లాలో పది వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం. ప్రస్తుతం నిర్లక్ష్యరాస్యులతో పాటు వాలంటీర్లను గుర్తించాం. తొలి దశలో శిక్షణ పొందుతారు. ఎవరైనా మిగిలి పోతే వారికి మలి దశలో శిక్షణ ఉంటుంది.



పొట్టకూటికి వెళుతుండగా..

- డ్రైవర్ నిర్లక్ష్యంతో ఆటో బోల్తా
- జాతీయ రహదారి నిర్మాణాల వద్ద అదుపుతప్పి ప్రమాదం
- ఐదుగురు మహిళా కూలీలకు గాయాలు
- మెరుగైన వైద్యం కోసం ఒకరు విజయవాడకు

చీరాలటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్ నిర్లక్ష్యంతో పొట్టకూటికి వెళుతున్న మహిళ కూలీల ఆటో బోల్తాపడింది. దీంతో ఐదుగురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. చీరాల మండల పరిధి లోని విజయనగర్ కాలనీకు చెందిన అట్లూరి సుజాత (పక్కటెముకులకు గాయాలు). తేళ్ల అన్నామణి (వెన్నుపూసకు గాయం), కాకాణి దేవమ్మ(తలకు), తేళ్ల అరుణ (తలకు), కంభాలపాటి పేరమ్మ (గడ్డం) గాయపడ్డారు. మరో ఐదుగురు మహిళలు వ్యవసాయ కూలీలు. వీరంతా ఎప్పటిలాగే ఆటో డ్రైవర్ సురేష్ ఆటోలు కారంచేడు రోడ్డులోని చిట్టివాద పొలాల్లో నాట్లు వేసేందుకు వెళుతున్నారు. ఈ మార్గంలో జాతీయ రహదారి నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. నల్ల చెరువు సమీపానికి వెళ్లేసరికి డ్రైవర్ వాహనాన్ని కంట్రోల్ తప్పాడు. దీంతో ఓ వైపు చక్రం డౌన్ కాగా అకస్మాత్తుగా ఆటో బోల్తా పడింది. ఈక్రమంలో ఆటోలో ముందు కూర్చున్న సుజాతపై ఆటోతో సహా అందరూ పడ్డారు. దీంతో అందరూ ఒక్కసారిగా బిగ్గరగా కేకలు వేశారు. ఆ సమయంలో అటుగా వెళుతున్న వ్యక్తులు ఆటో నిలబెట్టారు. మొత్తానికి 10 మంది కూలీల్లో ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రుల ను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా, సుజాతను మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. అలాగే డ్రైవర్ సురేష్ చేతికి గాయమైంది.


విజయవాడకు తరలిన సుజాత


తేళ్ల అరుణ


కాకాణి దేవమ్మ


తేళ్ల అన్నామణి

మైనర్ నిర్లక్ష్యంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

భార్యకు తప్పిన ప్రమాదం


గాయపడిన వ్యక్తిని హస్పిటల్‌కు తరలిస్తున్న పోలీసులు

చీరాలటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఓ మైనర్ నిర్లక్ష్యంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చీరాల ఏరియా హస్పిటల్ ఎదురుగా చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం స్థానిక ఉడ్‌నగర్‌కు చెందిన రవిశంకర్, శోభన దంపతులు. వారి పిల్లలను స్కూల్ నుంచి తెచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. అదే సమయంలో ఎదురుగా అతివేగంగా మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న హయ్యర్‌పేటకు చెందిన మైనర్ వీరిని ఢీకొట్టాడు. ప్రమాదంలో రవిశంకర్ ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. భార్య శోభనకు ప్రమాదం తప్పింది. అయితే ఇటీవల ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా సీఐ శ్రీనివాసరావు పట్టణంలో కొన్ని నిర్దేశ ప్రదేశాల్లో సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈక్రమంలో అక్కడే విధుల్లో ఉన్న మహిళా పోలీసులు మార్తమ్మ, మమత క్షతగాత్రుడిని వెంటనే పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేత అల్లుడు మృతి


సదాశివరావు (ఫైల్)

చినగంజాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మినీ లారీ ఢీకొట్టిన ఘటనలో టీడీపీ నేత, పర్చూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి అల్లుడు మృతి చెందారు. చినగంజాం, ఉప్పుగుండూరు టోల్‌ప్లాజా సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శీలం రమేష్ తెలిపిన కథనం మేరకు.. నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన మారెళ్ల సదాశివరావు (49) తన ద్విచక్ర వాహనంపై కారంచేడు తన మేనమామ ఇంటికి బయలుదేరారు. టోల్‌ప్లాజా సమీపంలోని జాతీయ రహదారిపై తన ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో ఎదురుగా విజయవాడ నుంచి ఒంగోలు వెళ్తున్న మినీలారీ సదాశివరావుని ఢీకొట్టింది. తలకు బలమైన గాయమై ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మేనమామ జిల్లెళ్లమూడి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. ఒంగోలులో మినీలారీని, డ్రైవర్ నాయబ్‌రసూల్‌ని అదుపులోనికి తీసుకొని చినగంజాం పోలీసుస్టేషన్‌కు తరలించారు.

సదాశివరావు పదేళ్ల కిందట కారంచేడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు యార్లగడ్డ అక్కయ్యచౌదరి కుమార్తె శేషకుమారిని వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడున్నారు. సదాశివరావుది వ్యవసాయం కుటుంబం. తన మామ అక్కయ్యచౌదరి ఈ నెల 3వ తేదీన మృతి చెందడంతో కుటుంబసభ్యులతో కారంచేడు వెళ్లారు. అతని అంత్యక్రియలు అనంతరం 4వ తేదీ రాత్రి నాగులుప్పలపాడు గ్రామానికి వచ్చారు. మంగళవారం నాగులుప్పలపాడు నుంచి కారంచేడు గ్రామానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో సదాశివరావు మృతి చెందారు.

మామ అంత్యక్రియలకు వెళ్లి వస్తూ..

అక్కయ్య చౌదరి ఇంట మరో విషాదం

కారంచేడు : తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి ఇంట వరుస విషాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆదివారం అక్కయ్య చౌదరి అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం స్వగ్రామం కారంచేడులో అయనకు అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలు జరిగి 24 గంటలు గడవక ముందే మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లుడు మారెళ్ల సదాశివరావు మృతి చెందారు. చినగంజాం టోల్ ప్లాజా సమీపంలో 216 జాతీయ రహదారిపై బైక్‌పై వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. సదాశివరావు మృతి చెందారు. దీంతో అక్కయ్య నివాసంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొండయ్య చీరాల ఏరియా ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చరిత్రకు చిహ్నం.. ఏదీ వైభవం

- ప్రాభవం కోల్పోతున్న దుర్గం దొరువు
- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న స్థలాలు
- చిల్లచెట్లలో ఊటబావి
- శతాధిక ఊడల మర్రిచెట్టుకు పొంచి ఉన్న ముప్పు

కనిగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ దేవరాయల కాలం నాటి దొరువుకు దుర్గతి పట్టింది. దొరువు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తామన్న హామీ కలగా మారింది. పాలకులు పట్టించుకోకపోవడంతో కనిగిరి చారిత్రక రుజువులు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. దుర్గం దొరువుకి ఎంతో చరిత్ర ఉంది. శ్రీకృష్ణదేవరాయలు కనిగిరి ప్రాంతాన్ని పాలించిన రోజుల్లో ప్రజలు, సైనికులు, రాజకుటుంబాల కోసం కొండ కింద దొరువును నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన యాదవ రాజులు, బహమనీ సుల్తానులు, బ్రిటీషు పాలకులు కూడా ఈ దొరువు నీటినే వాడుకునేవారు. ప్రస్తుతం దొరువు నీరంతా పచ్చగా మారి దుర్వాసన వస్తుంది. దశాబ్దాలు మారుతున్నా దొరువు అభివృద్ధికి ఎవరూ ముందుకు రాకపోవటంతో నాటి ప్రాభవం కోల్పోతుంది.


శతాధిక ఊడల మర్రిచెట్టును నరికి ఆ కొమ్మలను తరలిస్తున్న దృశ్యం

నిరుపయోగంగా ఊటబావి

నాటి చారిత్రక వైభవాలకు ఆలవాలంగా ఉన్న గుర్తులు చెరిపేసేందుకు కొంతమంది అక్రమార్కులు దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. దుర్గం పాలనా వైభవంలో సైనికులకు, వారి అశ్వాలకు, ఏనుగులకు సేద తీర్చిన దొరువు వద్ద ఉన్న శతాధిక ఊడల మర్రిచెట్టుకు ప్రస్తుతం ముప్పు వాటిల్లే దుస్థితి ఏర్పడింది. కొంతమంది అక్రమార్కులు దొరువు ప్రాంతంలో రిజిస్ట్రేషన్లు పుట్టించి, చివరకు ఊడల మర్రిచెట్టు కూడా రిజిస్ట్రేషన్ సర్వేలోనిదే అని ప్రచారం చేయటం అనుమానాలకు తావిస్తుంది. కనిగిరి ప్రజల దాహార్తిని తీర్చిన ఊటబావి నిరుపయోగంగా మారింది.


అక్రమ నిర్మాణాలతో కుచించుకు పోతున్న దొరువు కరకట్ట

ప్రశ్నార్థకంగా మారిన పార్కు ఏర్పాటు

నగర పంచాయతీ వైసీపీ పాలకవర్గం ఏర్పడి నాలగో సంవత్సరం పూర్తి కావస్తుంది. ఎన్నికల సందర్భంగా ప్రస్తుత పాలకవర్గం నేతలు దొరువును పార్కుగా తీర్చిదిద్దుతామని, పర్యాటక కేంద్రంగా మారుస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేక పోయారు. దొరువు అభివృద్ధికి విడుదల చేసిన రూ.2 కోట్లు దుర్వినియోగమయ్యాయి. దొరువు కట్ట వద్ద ఉన్న శతాధిక ఊడల మర్రిచెట్టు చుట్టూ అరుగు ఏర్పాటుచేసి పాదచారులు సేదతీర్చుకునే ఏర్పాట్లు చేస్తామని చెప్పిన హామీ నెరవేర్చ లేదు. దొరువులో వ్యర్థాలతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తుంది. దీంతో దొరువు వద్ద ఉన్న దేవాలయాలకు భక్తులు రావాలంటేనే జుగుప్సాకరంగా మారింది. కొండపైన దుర్గాదేవి ఆలయాలకు వెళ్లే భక్తులు ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడింది.


పాచిపట్టిన దుర్గం దొరువు నీరు

నాటి ప్రాభవాన్ని కాపాడాలి

- సోమిశెట్టి శ్రీనివాసులు, మానవతా సంస్థ సభ్యులు, హిందూ ధార్మికులు

ఎంతో పురాతన చరిత్రకు సాక్ష్యంగా ఉన్న రాయల దుర్గం దొరువు ప్రాభవాన్ని కాపాడాల్సిన ఆవశ్యకత ప్రభుత్వంపై, మున్సిపాల్టీ పాలకులపై ఉంది. ఆప్రాంతం అపరిశుభ్రంగా మారింది. ఇక్కడ అంకాలమ్మ దేవాలయం, దొరువు శివాలయం, బ్రహ్మంగారి ఆలయం, కొండపైన విజయమార్తేండేశ్వరాలయం, దొరువులో దుర్గాంబాలయం ఉంది.

దొరువు స్థలంలో ఆక్రమణలు

పట్టణంలోని దొరువు కొండ కింద ఐదు ఎకరాల స్థలం ఉంది. 2009లో ఎమ్మెల్యేగా ఉన్న ముక్కు ఉగ్రనరసింహారెడ్డి దొరువు కట్టకు రక్షణగా ఫెన్సింగ్ వేయించారు. ఆ తర్వాత ఆ ఫెన్సింగ్ ఆనవాళ్లు కూడా లేకుండా ఆక్రమణకు గురవుతోంది. కొంత మంది శాశ్వత నిర్మాణాలు చేసుకున్నారు. మరికొంతమంది స్థలాలను కబ్జా చేసి రిజస్ట్రేషన్లు పుట్టించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దొరువు కట్ట స్థలం రెండు వైపులా కొంతమేర ఆక్రమణకు గురయింది. ఆ ప్రాంతం చిల్లచెట్లు, పిచ్చిచెట్లతో నిండి చీకటి కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. పోలీసులు కూడా అటువైపు వెళ్ళకపోవటంతో కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పర్యాటక కేంద్రం మాట అటుంచి కనీసం ప్రాభవాన్ని కాపాడాల్సిన మున్సిపాల్టీ పాలకులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల
- అండర్-17 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజేతలుగా విశాఖ బాలురు, బాలికల జట్లు
- జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక


ఖోఖో బాలుర విజేత జట్టు(విశాఖ)కు ట్రోఫీ అందజేస్తున్న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తుమ్మపాల (అనకాపల్లి జిల్లా), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు వుంటుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. తుమ్మపాలలో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ, క్రీడా రంగం అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. జాతీయస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అనకాపల్లిలో స్టేడియం నిర్మించే అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. అండర్-17 విభాగంలో జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి బాలురు, బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలురు, బాలికల విభాగాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. బాలుర విభాగంలో ద్వితీయ బహుమతిని ప్రకాశం జిల్లా, తృతీయ బహుమతిని కృష్ణా జిల్లా, బాలికల విభాగంలో ద్వితీయ బహుమతిని నెల్లూరు, తృతీయ బహుమతిని తూర్పుగోదావరి జిల్లా జట్లు పొందాయి.

జాతీయ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో డిసెంబరు ఐదు నుంచి తొమ్మిదో తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే రాష్ట్రస్థాయి అండర్-17 బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. బాలుర జట్టులో జి.అజయ్ (విశాఖ), బి.సాయి (విశాఖ), ప్రసాద్ (విశాఖ), వినయ్ (ప్రకాశం), పి.నరేశ్ (ప్రకాశం), రాకేశ్ (కృష్ణా), ఎం.శివ (విజయనగరం), తిరుమల (శ్రీకాకుళం), శశాంత్ గౌడ్ (అనంతపురం), ఎస్.నవీన్ (నెల్లూరు), జె.యాలప్ప (కర్నూలు), పవన్ (చిత్తూరు) వున్నారు. బాలికల జట్టులో కె.లాస్య (విశాఖ), పి.జోత్స్న (విశాఖపట్నం), జె.గీత (విశాఖపట్నం), డి.నందిని (తూర్పుగోదావరి), సీహెచ్.లావణ్య (విజయగనరం), బి.భార్గవి (నెల్లూరు), డి.రంగ మహాలక్ష్మి(గుంటూరు), కాకి దివ్య (పశ్చిమగోదావరి), కె.పవిత్ర (నెల్లూరు), ఎస్ఏ హస్విత (చిత్తూరు), జి.దేవి (కడప), జి.భవాని (శ్రీకాకుళం) ఉన్నారు.

కారుచౌకగా కొట్టేసి.. అడ్డగోలు అనుమతులు

(3వ పేజీ తరువాయి)

జగన్ కుటుంబం కొనుగోలు చేసిన భూములను మంగళవారం పవన్‌కల్యాణ్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ దళితులను, రైతులను భయపెట్టి సొంత కంపెనీ కోసం జగన్ కారుచౌకగా భూములు కొనుగోలు చేశారన్నారు. మాచవరం, దాచేపల్లి మండలాల్లో సరస్వతి పవర్ ఇండస్ట్రీ పేరుతో భూములు కొనుగోలు సమయంలో రైతులకు ఇచ్చిన మాటను అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి, ఆ తర్వాత జగన్‌రెడ్డి మరిచారన్నారు. దళితులను, రైతులను బెదిరించి దాడులు చేసి పెట్రో బాంబులు వేసి వేటకొడవళ్లతో వెంటాడి భూములను హస్తగతం చేసుకున్నారన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కోడెల శివప్రసాదరావుపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేసి ఫర్నిచర్ కొట్టేశాడని అక్రమంగా కేసులు పెట్టి వేధించి చనిపోయేలా చేశారన్నారు. మరి వందల ఎకరాల భూములను కారుచౌకగా కొట్టేసి, అడ్డగోలు అనుమతులు తెచ్చుకున్న జగన్‌పై ఎన్ని కేసులు పెట్టాలని ప్రశ్నించారు. సీఎంగా చంద్రబాబు, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాకుంటే ఏపీ పరిస్థితి వేరుగా ఉండేదని తెలిపారు. సరస్వతి భూముల విషయంపై క్యాబినెట్‌లో చర్చిస్తామన్నారు. సరస్వతి భూములపై గతంలో జరిగిన అన్ని విషయాలను యరపతినేని ద్వారా తెలుసుకున్నానని, యరపతినేని రైతులకు అండగా ఉంటున్నారన్నారు.

రైతులపై దాడులు చేస్తే ఉపేక్షించొద్దు

సరస్వతి పవర్ ఇండస్ట్రీకి భూములిచ్చిన రైతులపై దాడులు చేస్తే ఉపేక్షించవద్దని పోలీసు అధికారులను పవన్‌కల్యాణ్ ఆదేశించారు. భూములిచ్చిన రైతుల్లో ఆత్మస్థైర్యం పెరిగేలా చూడాలని ఎస్పీ శ్రీనివాసరావును ఆదేశించారు. మాచవరం మండలం చెన్నాయపాలెంలో 272.96, పిన్నెల్లిలో 93.79, వేమవరంలో 710.63, తంగెడలో 107.365 ఎకరాలు ఉన్నాయని, వాటిలో పట్టా 1083.715, చుక్కలు 76.19, అసైన్డ్ భూములు 24.84 ఎకరాలన్నారు. అంతేకాకుండా 400 ఎకరాలు అటవీ భూములను రెవెన్యూ కిందకు మార్చేసి సరస్వతి పవర్ కోసం తీసుకున్నారన్నారు.

ఫ్యాక్టరీ నిర్మిస్తారా.. భూములిచ్చేస్తారా?

మూడేళ్లలో ఫ్యాక్టరీ నిర్మించి, యువతకు ఉద్యోగాలిస్తామని రైతులను మభ్య పెట్టి భూములు కొనుగోలు చేసి 15 ఏళ్లుగా ఆ ఊసే మరిచిన జగన్ ఇప్పటికైనా ఫ్యాక్టరీ నిర్మించడమా లేదంటే భూములు తిరిగి ఇచ్చేయడమో చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సరస్వతి పవర్ పేరుతో తక్కువ ధరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి వేల కోట్ల రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. ఫ్యాక్టరీ నిర్మించకుండా, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా రైతులను రోజు వారి కూలీలుగా మార్చారన్నారు. ఫ్యాక్టరీ నిర్మించకపోవడంతో కొంత మంది రైతులు భూములు సాగు చేసుకునేందుకు యత్నించగా అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిలు గూండాలతో వచ్చి దాడులు చేశారన్నారు. సాక్షి పత్రికను అడ్డం పెట్టుకుని ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు రాస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. 500 ఎకరాల భూమిని సరస్వతి భూముల్లో జగన్ కలిపేసుకున్నాడన్నారు. వందలాది మంది రైతులు కొన్నేళ్లుగా ఉపాధి లేక అల్లాడిపోతున్నా జగన్‌కు ఏమాత్రం పట్టడం లేదన్నారు. అంతకముందు సరస్వతి భూములను ఓపెన్ టాప్ వాహనంపై నుంచి పవన్‌కల్యాణ్ పరిశీలించారు. అనంతరం కొందరు రైతులతో పవన్‌కల్యాణ్, యరపతినేని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్‌గోనేరి, ఆర్డీవో మురళీకృష్ణలతో పాటు వివిధ శాఖల అధికారులు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

టోల్ బాదుడు

(3వ పేజీ తరువాయి)

చార్జీలతో కారు/జీపు/వ్యాన్ సింగిల్ జర్నీకి రూ.145, రిటర్న్ జర్నీకి రూ.220, నెలవారీ పాసు రూ.4790కి పెంచింది. అదే ఎల్‌సీవీ వాహనానికి సింగిల్ జర్నీకి రూ.245, బస్సు/ట్రక్‌కు రూ.515, మూడు యాక్సిల్ వాహనం వరకు రూ.565, 4 నుంచి 6 యాక్సెల్స్ ఉన్న వాహనాలకు రూ.810, హెచ్‌సీఎం/ఈఎంఈకి రూ.810, 7, అంతకంటే ఎక్కువ యాక్సెల్ వాహనాలకు రూ.820కి పెంచింది. రిటర్న్ జర్నీ ఎల్‌సీవీకి రూ.370, బస్సు/ట్రక్‌కు రూ.770, త్రీ యాక్సెల్ వరకు వాహనాలకు రూ.845, 4 నుంచి 6 యాక్సెల్ వరకు వాహనాలకు రూ.1215, హెచ్‌సీఎం/ఈఎంఈకి రూ.1215, ఏడు, అంతకంటే ఎక్కువ యాక్సెల్ ఉన్న వాహనాలకు రూ.1230కి పెంచేసింది. నెలవారీ చార్జీలను కూడా బాదేసింది. ఎల్‌సీవీకి రూ.8230, బస్సు/ట్రక్‌కు రూ.17085, త్రీ యాక్సెల్ వరకు రూ.18810, 4 నుంచి 6 యాక్సెల్ వాహనాలకు రూ.27035, హెచ్‌సీఎం/ఈఎంఈకి రూ.27035, ఏడు, అంతకంటే ఎక్కువ యాక్సెల్ వాహనాలకు రూ.27290కి పెంచింది.

బస్సు చార్జీలు పెంచక తప్పని పరిస్థితి

టోల్ ప్లాజా రేట్లు పెంచడంతో ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల చార్జీలను తప్పక పెంచాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. గతంలో 24 గంటల్లో ఎన్ని రిటర్న్ జర్నీలైనా చేసే అవకాశం ఉన్నందున ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు ఆ చార్జీలను ప్రయాణికుల వద్దనే వసూలు చేసేవారు. ఇప్పుడు ట్రిప్పుల లెక్కన టోల్‌చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఉదాహరణకు తాడికొండ - మంగళగిరి మధ్య ప్రైవేటు ఆపరేటర్ గతంలో నెలవారీ పాస్ తీసుకుంటే రూ.6500 అయ్యేది. ఇప్పుడు అపరిమిత రిటర్న్ జర్నీలు ఎత్తేయడం వల్ల నెలకు దాదాపుగా రూ.45 వేలు చెల్లించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఇదే పరిస్థితి ఆర్టీసీపై కూడా పడుతుంది. దీంతో వారు టిక్కెట్ల ధరలు పెంచి టోల్ భారాన్ని ప్రయాణికుల నుంచి వసూలు చేసే అవకాశం ఉంది.

నెలవారీ పాస్ చార్జీల్లోనూ పెరుగుదల

గతంలో టోల్‌ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తూ సొంత వాహనాలు కలిగిన వారికి నెలవారీ పాస్‌లను జారీ చేసేవారు. రూ.150 కట్టించుకుని ఈ పాస్ ఇచ్చేవారు. నెలలో 50 సింగిల్ జర్నీలు చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు దానిని రూ.340కి పెంచింది. 50 సింగిల్ జర్నీలు దాటితే అదనంగా చెల్లించాల్సి వచ్చేది.

అర్జీలను సహేతుకంగా పరిష్కరించాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) అర్జీలు సహేతుకంగా పరిష్కారమయ్యేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత డివిజన్ సబ్‌కలెక్టర్, ఆర్డీవోలదేనని జిల్లాకలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో జాయింట్‌కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి ఒంగోలు డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అర్జీలను క్షేత్రస్థాయి అధికారులు పరిష్కరిస్తున్న తీరును ఆయా డివిజనల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మీకోసం అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై ఆడిట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సమస్యలపై వస్తున్న అర్జీలు రానురాను తగ్గుముఖం పడుతున్నాయని చెప్పారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ అర్జీల పరిష్కారం గడువు చివరి తేదీ వరకు వేచి చూడవద్దన్నారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఉన్నందున నీటి వనరులు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన్న ఓబులేషు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎస్‌వో పద్మశ్రీ, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎన్ఫోర్స్‌మెంట్ డీటీలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

చర్యలకు సిద్ధం

- రోజంతా హైడ్రామా అనంతరం సీఈవో రాజీనామా
- సీఎంవో ఆదేశాలతో కదిలిన సహకార శాఖ అధికారులు
- సెక్షన్ 51 విచారణవైపు అడుగులు

ఒంగోలు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో చోటు చేసుకున్న అక్రమాల వ్యవహారంపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. అందుకు సంబంధించి పలు పరిణామాలు మంగళవారం చోటుచేసుకున్నాయి. ఈ అక్రమాల బాగోతంపై ఏకంగా సెక్షన్ 51 విచారణ వేసే వైపు ఉన్నతస్థాయిలో అడుగులు పడుతున్నాయి. అదేసమయంలో స్థానికంగా బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి నేతృత్వంలోని పాలకమండలి దిద్దుబాటు చర్యలను వేగవంతం చేసింది. వారి ఆదేశానుసారం బ్యాంకు సీఈవో కోటిరెడ్డి మంగళవారం రాత్రి రాజీనామా చేసినట్లు తెలిసింది. అయితే ఈ విషయంలో రోజంతా పెద్ద హైడ్రామానే చోటు చేసుకున్నట్లు సమాచారం. బ్యాంకులో అక్రమాలపై విచారణ నేపథ్యంలో సీఈవోను బాధ్యతల నుంచి తప్పించడంతోపాటు సమగ్ర విచారణ కోసం సెక్షన్ 51 విచారణ కోరుతూ కలెక్టర్ రాసిన లేఖలపై సకాలంలో అటు ఉన్నత స్థాయిలో, ఇటు బ్యాంకు పాలక మండలి చర్యలు లేని విషయాన్ని ఆంధ్రజ్యోతి బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి వరుస కథనాలు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, ప్రభుత్వ పెద్దలలో పెద్ద చర్చకు దారితీయగా విషయం నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లింది. దీంతో సీఎం కార్యాలయం కూడా దీనిపై దృష్టిసారించింది. అలాగే సోమవారం కూడా డీఆర్సీ సమావేశానికి వచ్చిన ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణ చర్యలకు సూచించారు.

పాలకమండలి సమావేశంలో..

ఆ నేపథ్యంలో మంగళవారం బ్యాంకు పాలకమండలి సమావేశం పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ గోపాలకృష్ణ నేతృత్వంలో మంగళవారం బ్యాంకులో జరిగింది. కలెక్టర్ సూచనల మేరకు సీఈవో విషయంపై చర్చ కోసం ఆ మీటింగ్ నిర్వహించినా అందులో తక్షణం ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. సీఈవోను తొలగించడం కన్నా ఆయనే రాజీనామా చేస్తే బాగుటుందన్న భావనతో పర్సన్ ఇన్‌చార్జి సూచనలతో బ్యాంకు అధికారులు పలుమార్లు సీఈవోతో సంప్రదింపులు చేసినట్లు సమాచారం. ఈ విషయంలో రోజంతా హైడ్రామా జరగ్గా ఎట్టకేలకు రాత్రి సమయానికి సీఈవో తన రాజీనామాను పీఏసీ ఛైర్మన్‌కు ఇచ్చినట్లు తెలిసింది. అయితే దానిని ధ్రువీకరించి చెప్పేందుకు బ్యాంకు ప్రస్తుత అధికారులు ధైర్యం చేయడం లేదు. మొత్తం మీద సీఈవో కోటిరెడ్డి రాజీనామా చేసినట్లు సహకార బ్యాంకు ఉద్యోగులలో రాత్రి పొద్దుపోయాక విస్తృత చర్చ సాగింది. ఆ విషయం అలా ఉంచితే బ్యాంకులో అక్రమాలు, కలెక్టర్ రాసిన లేఖలపై ఉన్నతాధికారులు సకాలంలో స్పందించని విషయం సీఎం దృష్టికి వెళ్లింది. దీంతో ప్రస్తుత సహకార శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు కదిలారు. బ్యాంకులో అక్రమాలను నిగ్గుతేల్చేందుకు సెక్షన్ 51 విచారణ వైపు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులు పలు విషయాలపై మంగళవారం కలెక్టర్ అన్సారియాతో మాట్లాడినట్లు తెలిసింది. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై ప్రాథమిక నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు వారు సూచించినట్లు తెలిసింది. ఆ నివేదిక ఆధారంగా సెక్షన్ 51 విచారణ వేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

క్వారీల్లో తనిఖీలు

చీమకుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : రామతీర్థం గ్రానైట్ క్వారీల్లో నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాల్లో భాగంగా తనిఖీ బృందాలు రెండోరోజైన మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గోల్డెన్ గ్రానైట్ క్వారీలో మేనేజర్ గిరి తనిఖీ సభ్యులకు స్వాగతం పలికారు. కార్మికులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం క్వారీలో నిర్వహించే కార్యకలాపాలను బృందసభ్యులు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. అదేవిధంగా పెరల్, మిడ్‌వెస్ట్, జెమ్, కామాక్షి, బీవీఎల్ గ్రానైట్ క్వారీల్లో తనిఖీలు జరిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సంతమాగులూరు, నవంబరు 5 : మండలంలోని పుట్టావారిపాలెం అడ్డరోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పుట్టావారిపాలెం అడ్డరోడ్డులోని సమోసాల దుకాణం వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఆ వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అతడి ఎడమ చేతిపై చిన్న లాజర్ అని రాసివుంది. కుడి చేతివేలికి ఉన్న ఉంగరంపై శిలువ గుర్తు ఉన్నట్లు తెలిపారు.

సార్.. అంబులెన్స్ కావాలి.. గంట ఆగండి!

- అందుబాటులో లేని 108
- సరిపడా వాహనాలు లేక అత్యవసర రోగుల అవస్థలు
- రిఫర్‌లతో చేతులు దులుపుకుంటున్న ఏరియా వైద్యశాల వైద్యులు
- నిత్యం చీరాల నుంచి 6- 10 కేసులు
- మార్గమధ్యలోనే కాన్పులు
- అధికారులు పట్టించుకోవాలని ఆవేదన



మరమ్మతుకు గురైన వాహనాలు

చీరాలటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అత్యవసరమైతే 108కి ఫోన్ చేస్తే ఆగమేఘాల్లో వచ్చి రోగిని ఆసుపత్రికి తీసుకెళ్తుంది.. ఇది అంబులెన్స్ పని.. కానీ అంబులెన్స్‌కు కావాలని ఫోన్ చేస్తే గంట ఆగాలని అటునుంచి సమాధానం వస్తుంది. దీంతో చేసేది లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఉంది.

చీరాల ఏరియా వైద్యశాల 100 పడకల హాస్పిటల్‌గా రూపాంతరం చెంది నిత్యం రోగులతో బిజీబిజీగా మారింది. ఇక్కడికి మార్టూరు, ఉప్పుగుండూరు, చినగంజాం, పెదగంజాం, నాగులుప్పలపాడుకు చెందిన రోగులు నిత్యం అత్యవసర, సాధారణ వైద్య సేవల కోసం పెద్ద సంఖ్యలో వస్తున్నారు. జాతీయ రహదారితోపాటు వాహనాల రద్దీ పెరగడంతో ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయి. దీంతో అత్యవసర సేవలకు గిరాకీ బాగానే పెరిగింది. ఏరియా హాస్పిటల్‌కు వచ్చే గర్భిణులు, రోడ్డు ప్రమాదాలకు సంబంధించి వైద్యులు ప్రతిసారీ ఇతర ఆసుపత్రులకు (రిఫర్) పంపిస్తూ చేతులు దులపుకుంటున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. చేసేది లేక గర్భిణులు సైతం ఒంగోలుకు వెళుతూ మార్గమధ్యలోనే కాన్పు అవుతున్నారు. పీహెచ్‌సీల్లోనే కాన్పులు జరగాలని ఒకపక్క అధికారులు సూచిస్తుంటే, ఏరియా హాస్పిటల్ మాత్రం చిన్నవాటికి కూడా రిఫర్ చేయడంపై రోగులు, వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిఫర్ రాయగానే సమస్య పెద్దదని రోగులు ఆందోళన చెందుతూ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు.

అందుబాటులో లేని 108

ప్రస్తుతం చీరాల ఏరియా వైద్యశాల పరిధిలో చీరాలకు ఒకటి, వేటపాలెం 1, కారంచేడుకు ఒక 108 వాహనాలు ఉన్నాయి. అంతకుముందే హాస్పిటల్‌కు అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిన అదనపు వాహనం చాలాకాలంగా మూలనపడింది. అంతకు ముందు మరో వాహనం కూడా మరమ్మతులకు చేరడంతో ప్రస్తుతం హాస్పిటల్‌లో రెండు నిరుపయోగంగా ఉన్నాయి. వాడకంలో ఉన్న వాహనాలు కూడా అంతంత మాత్రంగానే నడుస్తున్నాయి. ఈక్రమంలో అత్యవసర వైద్యం కోసం రోగులు 108ని సంప్రదిస్తే వారికి వినబడే స్వరం ఒక్కటే సుమారు గంట పడుతుంది ఉండగలా...దీంతో ప్రజలు అత్యవసర సమయాల్లో ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు హాస్పిటల్ వైద్యులు నిర్లక్ష్యంతో కొన్నిసార్లు వాహనాలు రిఫర్‌లో ఉంటున్నాయి. ఈక్రమంలో అత్యవసర వైద్యం కోసం ఆశ్రయించిన రోగులకు 108 అంబులెన్స్ సేవలు అందడం లేదు. ఈక్రమంలో వైద్యుల నిర్లక్ష్యంపై దృష్టిసారించాలని, మరమ్మతులు చేసి వాహనాలను అందుబాటులోకి తేవాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

తహసీల్దార్‌గా కవిత బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన కవిత

బల్లికురవ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ తహసీల్దార్‌గా దామూరి కవిత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్‌లో ఆమె ఇక్కడ బాధ్యతలు తీసుకున్నప్పటికీ జిల్లా అధికారులు డిప్యూటేషన్‌పై కలెక్టర్ కార్యాలయానికి పంపారు. తిరిగి ఆమె మంగళవారం చార్జి తీసుకున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కవిత మాట్లాడుతు రైతులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. సమస్యలను ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కవిత కోరారు. టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, కార్యాలయ ఉద్యోగులు తహసీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పర్చూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని బొమ్మల సెంటర్ ప్రాంగణంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటులో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంట్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏఈ రమేష్ నాయక్ మంగళవారం తెలిపారు.



క్వారీలో తనిఖీలు చేస్తున్న టీం

భద్రతపై అప్రమత్తంగా ఉంటాం

ప్రతిజ్ఞ చేసిన గ్రానైట్ కార్మికులు

బల్లికురవ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గనులలో పనులు చేసే సమయంలో అప్రమత్తంగా ఉంటామని గ్రానైట్ కార్మికులు ప్రతిజ్ఞ చేశారు. మంగళవారం వీర్ల కొండ వద్ద ఉన్న ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్, సాయిస్టోన్, ఇంపీరియల్, కేఎస్ఆర్ గ్రానైట్ క్వారీలలో భద్రతా వారోత్సవాలు జరిగాయి. ఈసందర్భంగా తనిఖీ బృందాలు క్వారీలలో చేపడుతున్న భద్రతా చర్యలపై పరిశీలిన జరిపి నివేదికలను తయారు చేశారు. ముందుగా అన్ని క్వారీలలో కార్మికులకు భద్రత చర్యల గురించి వివరించి వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా టీం కన్వీనర్లు మాట్లాడుతూ గనులలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ముందస్తుగా ఏటా భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, క్వారీ యజమానుల సహకారం బాగుందని తెలిపారు. కార్యక్రమంలో టీం కన్వీనర్‌లు లీలారామ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పత్తిని సీసీఐ కేంద్రాల్లోనే అమ్మాలి



పత్తిని పరిశీలిస్తున్న ఏవో కుమారి

బల్లికురవ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులలంతా పత్తికి మద్దతు ధర లభించేలా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. మంగళవారం మండలంలోని సోమవరప్పాడు, ఉప్పుమాగులూరు గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ పత్తి క్వింటా రూ.7521గా ప్రభుత్వం మద్దతు ధరను నిర్ణయించి కొనుగోలు చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రబీ పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ అధికారి శ్రీనివాస్, వీఏఏలు హనుమనాయక్, హరికృష్ణ పాల్గొన్నారు.

పంగులూరు : వరి పైరులో కాండం తొలుచు పరుగును గుర్తించినట్లు వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని బైటమంజులూరు, ముప్పవరం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పైరుకు కాండం తొలుచు పురుగు ఆశించిదని, దాని నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు ఏవో సూచించారు. కార్యక్రమంలో కుక్కపల్లి ఏడుకొండలు, భాస్కరరావు, ఏఈవో ప్రభాకరరావు, వ్యవసాయ సహాయకులు పృధ్వీసాయి, దిల్షియా పాల్గొన్నారు.

వరిలో ఉల్లికోడు

అద్దంకిటౌన్ : వరిలో ఉల్లికోడు నివారణ లక్షణాలను రైతులు గమనించి చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పేరాయపాలెం, మోదేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉల్లికోడు నివారణకు కార్బో ఫ్యూరాన్ 3జీ గుళికలు వేసుకోవాలని, పైరు పిలక దశలో కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 400 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. కూరగాయల సాగు రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఉద్యాన అధికారి ఎస్.దీప్తి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అనిల్‌కుమార్, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ దుర్గారావు, బీమని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

పంగులూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలల బాలికలకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. పంగులూరు రోటరీ భవనం ప్రాంగణంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కాలేషావలి, డాక్టర్ బత్తుల వీరనారాయణ పర్యవేక్షణలో పంగులూరు, చందలూరు, కొండమంజులూరు ఉన్నత పాఠశాలలకు చెందిన ఐదుగురు బాలికలకు సైకిళ్లను అందచేశారు. హైదరాబాద్ నార్త్ వెల్లజాన్ ప్రాజెక్ట్ ద్వారా పంగులూరు క్లబ్‌కు 10 సైకిళ్లు సమకూరినట్లు డాక్టర్ వీరనారాయణ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ క్యాంప్ చైర్మన్ చిలుకూరి వీరరాఘవయ్య, ప్రతినిధులు రాయిణి రామారావు, సుబ్బారావు, ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సభను జయప్రదం చేయండి

అద్దంకిటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 11వ తేదీన జరిగే మాదిగల ఆత్మయ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డీ వందనం మాదిగ కోరారు. మంగళవారం అద్దంకిలోని అంబేడ్కర్ సామాజిక భవనంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కారక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు వంగవరపు రమేష్, మాదిగ ఉద్యోగుల సంఘం అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు అనపర్తి రమేష్, ప్రధాన కార్యదర్శి గంగవరపు సిద్దు, బుజ్జిబాబు, పొన్నూరు నేరేంద్ర, చక్రవర్తి, కోటయ్య, మున్నంగి కోటేశ్వరరావు, ఎలీషా, ఉదయ్‌కుమార్, శ్రీనివాసరావు, అనిల్, అశోక్ పాల్గొన్నారు.



జూట్ బ్యాగులను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యం

చీరాలటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్క పౌరుడు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యం అందుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 100 మందికి జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు బండారుపల్లి హేమంత్ కుమార్, వలివేటి మురళీకృష్ణ, నాగవీరభద్రాచారి, పవని భానుచంద్రమూర్తి, బత్తుల బ్రహ్మారెడ్డి, వడలి రాధాకృష్ణ పాల్గొన్నారు.

మొరాయిస్తున్న బైపాస్ రైడర్ బస్సులు



రొంపేరు బ్రిడ్జిపై ఆగిన బస్సు

చీరాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల-ఒంగోలు బైపాస్ రైడర్ బస్సులు కొన్ని సందర్భాల్లో మొరాయిస్తున్నాయి. మంగళవారం చీరాల నుంచి ఒంగోలు వెళుతున్న బైపాస్ రైడర్ బస్సు చినగంజాం, ఉప్పుగుండూరు మధ్య రొంపేరు బ్రిడ్జి పైన టైరుకు పంక్చర్ కావడంతో ఆగిపోయింది. 46 మంది ప్రయాణికులు ఉండగా, నలుగురు వేరే విధంగా అక్కడ నుంచి తమ గమ్యస్థానాలకు వెళ్లారు. మిగిలిన 42 మంది తరువాత చీరాల నుంచి ఒంగోలు వేళ్లే బైపాస్ రైడర్ బస్సులో ఎక్కి ఒంగోలు చేరారు. మెరుగైన సేవందించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టెక్నాలజీతో నైపుణ్యతను పెంపొందించుకోవాలి

పంగులూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు టెక్నాలజీ వినియోగంతో నైపుణ్యతను పెంపొందించుకుని సమాజంలో ఉన్నతంగా ఎదగాలని ఎస్ఐ వినోద్‌బాబు అన్నారు. మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు లైఫ్ స్కిల్స్‌పై పలు సూచనలు చేశారు. సెల్ ఫోన్ ద్వారా అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయడం వలన కలిగే అనర్థాలు, ఆన్‌లైన్ గేమ్స్‌తో ఇబ్బందులను ఆయన వివరించారు. ఇలాంటి వాటికి విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం అబ్దుల్‌సమద్, పీసీ కోటేశ్వరరావు, ప్రభాకర్, స్టాఫ్ సెక్రటరీ రామకోటిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగుతున్న దీక్షధారుల పాదయాత్ర



పాదయాత్ర నిర్వహిస్తున్న దీక్షధారులు

సంతమాగులూరు, నవంబరు 5 : మండలంలోని కుందుర్రు గ్రామానికి చెందిన అయ్యప్ప దీక్షధారులు చేపట్టిన శబరిమల పాదయాత్ర దిగ్విజయంగా కొనసాగుతోంది. సంతమాగులూరు మండలం కుందుర్రు నుంచి ప్రారంభమైన పాదయాత్ర మంగళవారం సంతనూతలపాడు నియోజకవర్గంలోకి చేరినట్లు బృందం తెలిపింది.

నేటి నుంచి ఉపాధి గ్రామ సభలు

చినగంజాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గ్రామాల్లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేయాల్సిన పనుల గుర్తింపు, అంచనాల నిమిత్తం బుధవారం నుంచి గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి తెలిపారు. 6వ తేదీన చింతగుంపల్లి, మోటుపల్లి, మున్నంవారిపాలెం, నీలాయపాలెం, 7న చినగంజాం, గొనసపూడి, కడవకుదురు, సంతరావూరు, 8న కొత్తపాలెం, పల్లెపాలెం, పెదగంజాం, రాజుబంగారుపాలెం పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు జరుగుతాయని ఏపీవో జె.లక్ష్మీదేవి తెలిపారు

రెవెన్యూ రికార్డులను భద్రంగా ఉంచాలి

దర్శి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డులను సురక్షితమైన ప్రదేశంలో భద్రంగా ఉంచాలని కనిగిరి ఆర్డీవో కేశవర్ధనరెడ్డి సూచించారు. దర్శిలోని పాత తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. సుమారు 115 సంవత్సరాల క్రితం బ్రిటీష్ కాలంలో ఈ భవనాన్ని నిర్మించారు. సుమారు 40 సంవత్సరాలు ఆ భవనంలో కోర్టు నడిచింది. నూతన కోర్టు భవనాలు నిర్మించిన తర్వాత ఆ భవనంలో కొంతకాలం తహసీల్దార్ కార్యాలయంగా ఏర్పాటు చేసుకొని విధులు నిర్వహించారు. 2017లో నూతన తహసీల్దార్ కార్యాలయం నిర్మించిన తర్వాత ఆ భవనం ఖాళీగా ఉంది. అందులో రెవెన్యూ రికార్డులను భద్రపరచారు. ఈక్రమంలో ఆర్డీవో ఆ భవనాన్ని పరిశీలించి రికార్డులు చూశారు. వర్షాలు పడినప్పుడు భవనం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వర్షం పడినప్పుడు కొన్నిచోట్ల కారుతుండటంతో పరదాలు కప్పిన విషయాన్ని గుర్తుచేశారు. రెవెన్యూ రికార్డులు పటిష్టంగా భద్రపరచాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



భీమవరం వద్ద పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

చీరాలటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ పరిధిలో మంగళవారం నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు ఆలయాల వద్దకు పోటెత్తారు. నాగేంద్రుడిని మనసారా కొలిచారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈక్రమంలోనే యువతీ, యువకులు, మహిళలు ఉత్సాహంగా పుట్టల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బల్లికురవ : మండలంలోని అన్ని గ్రామాలలో మంగళవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో నాగుల చవితి పండగను జరుపుకొన్నారు. పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, పుట్టలో పాలు పోశారు. వీర్ల గంగమ్మ దేవాలయం వద్ద ఉన్న పుట్ట వద్ద, శివాలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

చినగంజాం : మండల పరిధిలోని భక్తులు నాగుల చవితి పండుగను భక్తిశ్రద్ధలతో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నాగేంద్రస్వామి ఆలయాలల్లో, పుట్టల వద్ద భక్తులు పసుపు, కుంకులతో నాగశిలలను అలకరించి ప్రదక్షిణలు చేశారు. పుట్టలో చలిమిడి, పానకం, సజ్జలు, వడపప్పు, ఆవు పాలను వంచి, దారాలను చుట్టి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. కొత్తపాలెంలోని బాలకోటేశ్వర స్వామి, కడవకుదురు బస్టాండ్ సమీపంలో, చినగంజాం వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేశారు.



కారంచేడులో పూజలు చేస్తున్న భక్తులు

పర్చూరు : నాగులచవితిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పొలిమేర వద్ద స్వామివారి పుట్టలో పాలు పోసి, పూజలు చేశారు. ఉప్పుటూరులో పుట్టకు పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కాల్వ సత్యనారాయణ నేతృత్వంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కారంచేడు, అదిపూడిలో పూజలు చేశారు.

ఇంకొల్లు : గంగవరం, భీమవరంలో నాగుల పుట్టకు పూజలు చేశారు. 40 ఏళ్ల చరిత్ర కలిగిన నాగేంద్రస్వామి పుట్ట వద్దకు అధిక సంఖ్యలో మహిళలు తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మేదరమెట్ల : నాగులచవితిపండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దైవాలరావూరు, రెడ్డిపాలెం గ్రామాల్లో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేశారు. పుట్టలో పాలుపోసి నైవేద్యాలు సమర్పించారు. రెడ్డిపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఏకరాతి శిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వీరాంజనేయులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి

వీరాంజనేయులు కుటుంబ సభ్యులకు మంత్రి గొట్టిపాటి పరామర్శ

బల్లికురవ. నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ధూళిపాళ్ల వీరాంజనేయులు రెండు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వీరాంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ విజయానికి వీరాంజనేయులు కృషి చేశారని, అయన మృతి తీరని లోటని గొట్టిపాటి అన్నారు. అనంతరం మంత్రి సంతమాగులూరు మండలం కామేపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుడు గంటా రంగారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు మలినేని గోవిందరావు చల్లగుండ్ల రాటంబాబు, మాదాల సాంబయ్య, దద్దాల అంజయ్య, భైరపునేని అజయ్, యాగంటి సింగరయ్య, పున్నారావు ఉన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

భూ సమస్యలను పరిష్కరిస్తాం

పంగులూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూముల రీసర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహించి చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ పీ సింగారావు అన్నారు. మండలంలోని అలవలపాడులో మంగళవారం రీసర్వే సమస్యలపై గ్రామసభను నిర్వహించారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ అర్జున్, మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో కోటేశ్వరరావు, నాగుల్‌మీరావలి పాల్గొన్నారు.

అసైన్డ్ భూమి వివాదంపై విచారణ

తోటవారిపాలెం(చీరాలటౌన్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం తోటవారిపాలెం పంచాయతీ రంగారావు పేటలో కొంతకాలంగా నెలకొన్న స్థల వివాదంపై తహసీల్దార్ గోపీకృష్ణ మంగళవారం విచారణ చేశారు. స్థలాన్ని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిసింది. తహసీల్దార్ వెంట రెవెన్యూ సిబ్బంది నాగకుమార్, శివారెడ్డి, గ్రామస్థులు గూడూరి శివరామప్రసాద్, గుమ్మడి చంద్ర, గుమ్మడి సూర్యప్రకాష్ ఉన్నారు.

ఉద్యోగులకు చిరునామా చిమ్మిరిబండ ఎస్సీకాలనీ

- వ్యవసాయమే ప్రధాన వృత్తి
- వివిధ రంగాలలో 50 మందికి పైగా ఎంప్లాయిస్

ధనిక, పేద తారతమ్యం లేకుండా కష్టపడి, ఇష్టపడి విద్యను అభ్యసించినవారిని ఆదరిస్తుంది చదువులతల్లి. పేద కుటుంబాలలోని వ్యక్తులు చదువుల తల్లిని నమ్ముకొని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు ఎంతోమంది ఉన్నారు. అలాంటి కుటుంబాలు మనకు మండలంలోని చిమ్మిరిబండ గ్రామంలో ఎస్సీ కాలనీలో కనిపిస్తాయి. ఈ కాలనీకి చెందిన వారు దాదాపుగా 50 మందికి పైగా వివిధ రంగాలలో ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండడం విశేషం.

మార్టూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు మండలం చిమ్మిరిబండకు ఓ ప్రత్యేక గుర్తింపు లభించింది. ఇక్కడి ఎస్సీ కాలనీకి చెందిన వారు అధికులు ప్రభుత్వ కార్యాలయాల్లో కొలువుదీరారు. వారిలో లాయర్లు, టీచర్లు, పోలీసులు, రిజిస్ట్రార్‌లు, విద్యుత్ శాఖ, ఆరోగ్యశాఖ, రెవెన్యూ తదితర విభాగాలలో ఉద్యోగులుగా రాణిస్తున్నారు. కొందరు ఉద్యోగ విరమణ పొందినప్పటికీ ఇంకా 50 మందికి పైగానే వివిధ వృత్తుల్లో రాణిస్తున్నారు. అదే చిమ్మిరిబండ ఎస్సీ కాలనీ ప్రత్యేకత.



వందనం పేరుతో ఉన్న ప్రభుత్వ జడ్పీ హైస్కూల్

చిమ్మిరిబండ గ్రామంలో 1800 మంది ఓటర్లు ఉండగా, వారిలో సగం ఓటర్లు 900 మంది ఎస్సీకాలనీకి చెందినవారు. ఈ కాలనీ వాసులలో 30 సెంట్ల నుంచి 4ఎకరాల వరకు పొలం ఉన్న రైతులు ఉన్నారు. వారంతా కష్టపడి పొలం పనులు చేసుకుంటారు. దానికి తోడు సమీపంలో సాగర్ మైనరు కాలువ ఉండడంతో సాగుపైనే ఆసక్తి చూపిస్తుంటారు. దీంతో ఈ కాలనీలో వలసలు తక్కువ. 1925లోనే ఈ కాలనీలో ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను తాళ్లూరి వందనం అనే వ్యక్తి ప్రారంభించారు. ఆయన తదనంతరం కుమారుడు సత్యానందం, కోడలు కృపమ్మ అదే స్కూల్‌లో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. వారు కాలనీలోని వారిని చైతన్య పరచి, దాదాపుగా ప్రతి కుటుంబం నుంచి పిల్లలు బడికి వచ్చే విధంగా కృషి చేశారు. ఇంకా ఈ స్కూల్లో పలువురు ఉపాధ్యాయుల కృషితో బడికి పోయేవారి సంఖ్య పెరిగింది. 2000లో యూపీ, జడ్పీ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయింది. ఈ స్కూల్‌కు తాళ్లూరి వందనం పేరు పెట్టడం విశేషం. ప్రస్తుతం ఈ హైస్కూల్‌కు వందనం మనవరాలు ఇందిరా ప్రియదర్శిని ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఇటీవల కాలనీకి చెందిన ప్రభుత్వ ఉద్యోగులందరి సహకారంతో సుమారు రూ.10లక్షలతో కాలనీ వద్ద డాక్టరు బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. అంతేగాకుండా కాలనీలో పేదకుటుంబాలకు, అనారోగ్యానికి గురైన వారికి కూడా వారు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు.



టీచర్లైన ఐదుగురు కుమార్తెలతో విశ్రాంత ఉపాధ్యాయిని కృపమ్మ